RNI TEL TEL 2024/89323.

# జన సంఘర్షణ

మా లక్ష్యం సామాన్యుని పక్షం

తెలుగు దినపత్రిక

| నిజామాబాద్ | సంపుటి : 03 | సంచిక : 191 | ఆగస్టు 11 మంగళవారం 2026 | ఎడిటర్ : రాచమల్లు మాధవి | పేజీలు 08 | వెల : రూ. 6.00 |
|---|---|---|---|---|---|---|
| Nizamabad | Vol: 03 | Vol: 191 | August 11 Tuesday2026 | Editor : rachamallu madhavi | Pages 08 | Cost: Rs 6.00 |

తక్షణమే కాళేశ్వరం మోటర్లు ఆన్ చేయాలి: మంత్రి ఉత్తమ్‌కు హరీశ్ రావు లేఖ

2

## 'హర్ ఘర్ తిరంగా'ను విజయవంతం చేయండి


### ప్రజలకు ప్రధాని మోదీ పిలుపు




**న్యూఢిల్లీ జనసంఘర్షణ**
త్రివర్ణ పతాకం ప్రతి భారతీయుడికీ నిరంతర ప్రేరణ అని, ప్రతి ఒక్కరూ 'హర్ ఘర్ తిరంగా' వేడుకల్లో ఉత్సాహంగా పాలుపంచుకోవాలని ప్రధాని నరేంద్ర మోదీ విజ్ఞప్తి చేశారు. మన జాతీయ జెండా దేశానికే గర్వకారణమని పేర్కొన్న ఆయన, ప్రతీ ఇంటిపై జెండాను ఎగురవేయడం ద్వారా అభివృద్ధి చెందిన భారత్ (వికసిత భారత్) నిర్మాణానికి మనందరి కట్టుబాటును చాటిచెప్పాలని కోరారు. దేశ స్వాతంత్ర్య పోరాటంలో మైలురాయిగా నిలిచిన క్విట్ ఇండియా ఉద్యమాన్ని ఈ సందర్భంగా ప్రధాని గుర్తుచేసుకున్నారు. 1942 ఆగస్టు 9న మహాత్మా గాంధీ నేతృత్వంలో ప్రారంభమైన ఆ ఉద్యమ సమరయోధుల త్యాగాలు, ధైర్యసాహసాలు ఎప్పటికీ మరువలేనివని కొనియాడారు. మరోవైపు కేరళలో వందేమాతర గీతాలాపనపై భిన్నమైన అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. తమ రాష్ట్రంలో వందేమాతర గీతాన్ని పూర్తిగా పాడబోమని కేరళ ఆరోగ్యశాఖ మంత్రి కె.మురళీధరన్‌తో పాటు కాంగ్రెస్ ఎంపీ రాజ్‌మోహన్ ఉన్నిథాన్ స్పష్టం చేశారు.గతంలో ఆనవాయితీగా వస్తున్నట్లుగానే గేయంలోని మొదటి రెండు చరణాలను మాత్రమే ఆలపిస్తామని వారు పేర్కొన్నారు.

## గ్లోబల్ హబ్‌గా తీర్చిదిద్దుతాం

### అమెరికా పర్యటనలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



**హైదరాబాద్ జనసంఘర్షణ**
తెలంగాణను శుద్ధ, పునరుత్పాదక ఇంధన రంగంలో అంతర్జాతీయ హబ్‌గా మార్చే దిశగా రాష్ట్ర ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. అధికారిక అమెరికా పర్యటనలో భాగంగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా, బర్కీలోని గోల్డ్‌మన్ స్కూల్ ఆఫ్ పబ్లిక్ పాలసీకి చెందిన 'ఇండియా ఎనర్జీ అండ్ క్లైమేట్ సెంటర్'ను సందర్శించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు, పాలసీ నిపుణులతో నిర్వహించిన ఉన్నత స్థాయి సమావేశంలో 2030 నాటికి 500 గిగావాట్ల నాన్-ఫాసిల్ (శిలాజయేతర) ఇంధన సామర్థ్యాన్ని సాధించాలనే భారత లక్ష్యానికి అనుగుణంగా తెలంగాణ అనుసరించాల్సిన వ్యూహాలపై లోతుగా చర్చించారు. గ్రిడ్ ఆధునీకరణ, పారిశ్రామిక డీకార్బనైజేషన్, ఆధునిక బ్యాటరీ స్టోరేజ్ వ్యవస్థలు, తగ్గుతున్న క్లీన్-టెక్నాలజీ వ్యయాలను వినియోగించుకోవడంపై తన ఆలోచనలను పంచుకున్నారు. ఈ సందర్భంగా తెలంగాణలో అమలు చేస్తున్న వినూత్న పునరుత్పాదక ఇంధన విధానాలను డిప్యూటీ సీఎం వివరించారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో స్వయం సహాయక సంఘాల మహిళల భాగస్వామ్యంతో సోలార్ ప్రాజెక్టుల నిర్వహణ, పీఎం-కుసుమ్ పథకం ద్వారా రైతులకు స్వచ్ఛ ఇంధనాన్ని అందించడం వంటి ప్రజాకేంద్రిత నమూనాలు అంతర్జాతీయ ప్రతినిధుల ప్రశంసలు అందుకున్నాయి. 24 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరాతో పాటు క్లీన్-టెక్ పరికరాల తయారీ రంగానికి ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహాన్ని ఆయన వివరించారు. సిలికాన్ వ్యాలీ ఆవిష్కరణలు, కాలిఫోర్నియా ఇంధన రంగానుభవాలను జోడించి తెలంగాణలో ఇంధన విప్లవానికి శ్రీకారం చుడతామని, విద్యుత్, రవాణా, పారిశ్రామిక రంగాల్లో సంయుక్త అధ్యయనాలు

➤ మిగతా 2వ పేజిలో..

## తెలంగాణలో ముగిసిన 'సర్' ఎన్యూమరేషన్ ప్రక్రియ

**హైదరాబాద్ జనసంఘర్షణ**
అక్టోబర్ 19న తుది ఓటర్ల జాబితా విడుదలతెలంగాణరాష్ట్రంలో ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ ఎన్యూమరేషన్ ప్రక్రియ అధికారికంగా ముగిసింది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 3,38,26,448 మంది ఓటర్లు ఉన్నట్లు నమోదు కాగా, దాదాపు 73.95 లక్షల ఓటర్ల పేర్ల తొలగింపునకు ప్రతిపాదనలు వచ్చినట్లు తెలుస్తోంది. ఇప్పటివరకు స్వీకరించిన ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియలో 2,64,30,494 ఫారాలు పూర్తయి, రాష్ట్రస్థాయిలో 78.14 శాతం పురోగతి నమోదైంది. జిల్లాలవారీగా డిజిటలైజేషన్ పరిశీలిస్తే, యాదాద్రి భువనగిరి జిల్లా 94.30 శాతంతో రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలవగా, మెదక్ (90.54%), సూర్యాపేట (90.43%) తరువాతి స్థానాల్లో నిలిచాయి. మరోవైపు,

➤ మిగతా 2వ పేజిలో..



## బదిలీలపై ఏపీ ప్రభుత్వం నిషేధం

### ఓటర్ల జాబితా సవరణ పూర్తయ్యే వరకు అధికారుల ఆదేశం




**అమరావతి జనసంఘర్షణ**
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక అధికారుల బదిలీలు, పోస్టింగులపై ఉన్న నిషేధాన్ని అక్టోబర్ 3 వరకు పొడిగిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఎస్ఆర్) ప్రక్రియ కొనసాగుతుండటంతో కేంద్ర ఎన్నికల సంఘం సూచనల మేరకు ఈ ఆదేశాలు జారీ అయ్యాయి. జులై 1, 2026 నాటికి అర్హత కలిగిన ఓటర్ల వివరాలను సవరించేందుకు గాను ఎన్నికల సంఘం సవరించిన నూతన షెడ్యూల్‌ను ప్రకటించింది. దీని ప్రకారం జులై 31 నుంచి ఆగస్టు 30 వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాల స్వీకరణ జరుగుతుండగా, వాటి పరిష్కార ప్రక్రియ సెప్టెంబర్ 28 వరకు

➤ మిగతా 2వ పేజిలో..

## రాంచీలో ఉవ్వెత్తున విద్యార్థుల నిరసన జ్వాలలు

### అసెంబ్లీ ముట్టడికి వేలాదిగా కదిలిన యూత్




**రాంచీ జనసంఘర్షణ**
ఝూర్ఖండ్ స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (జీూజ) పేపర్ లీకేజీ వ్యవహారం రాష్ట్ర రాజధాని రాంచీని తీవ్రంగా కుదిపేస్తోంది. ఈ ఉదంతంపై ప్రభుత్వంతో జరిపిన చర్చలు విఫలం కావడంతో ఆగ్రహించిన విద్యార్థులు తమ ఆందోళనలను మరింత తీవ్రతరం చేశారు. ముందస్తు ప్రణాళిక ప్రకారమే వేలాది మంది విద్యార్థులు అసెంబ్లీ వైపు భారీ ర్యాలీగా బయలుదేరారు. తమ భవిష్యత్తుతో ఆడుకుంటున్న పేపర్ లీకేజీలపై ప్రభుత్వం తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని, తమ డిమాండ్లను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ చేసిన నినాదాలతో రాంచీ వీధులు మార్మోగిపోయాయి. ఈ పోరాటంలో పాల్గొనేందుకు రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి అభ్యర్థులు, యువకులు పెద్ద సంఖ్యలో రాజధానికి చేరుకోవడంతో పరిస్థితులు తీవ్రంగా మారాయి. విద్యార్థుల అసెంబ్లీ ముట్టడి పిలుపుతో ముందస్తు జాగ్రత్తగా పోలీసులు నగరవ్యాప్తంగా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా ముఖ్యమైన రహదారులు, ప్రధాన కూడళ్ల వద్ద బారికేడ్లను ఏర్పాటు చేసి భారీగా బలగాలను మోహరించారు.

## అమిత్ షా ప్రకటన చేయాలి

### పార్లమెంట్‌లో ప్రతిష్టంభన తప్పదు: రాహుల్, ప్రియాంక హెచ్చరిక



**న్యూఢిల్లీ జనసంఘర్షణ**
ఢిల్లీలో పార్లమెంట్ మార్చ్ సందర్భంగా విద్యార్థులపై జరిగిన పోలీసు లాఠీచార్జ్ ఘటన తీవ్ర రూపం దాల్చింది. ఈ వ్యవహారంపై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా పార్లమెంట్‌లో స్పష్టమైన వివరణ ఇచ్చేంత వరకు ఉభయ సభల్లో ప్రతిష్టంభన కొనసాగుతుందని ప్రతిపక్ష కాంగ్రెస్

➤ మిగతా 2వ పేజిలో..

## గ్లోబల్ హబ్‌గా తీర్చిదిద్దుతాం

**మొదటి పేజీ తరువాయి..** మరియు నైపుణ్య శిక్షణ కోసం యూసీ బర్క్లీతో కలిసి పనిచేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు.

## బదిలీలపై ఏపీ ప్రభుత్వం నిషేధం

**మొదటి పేజీ తరువాయి..** కొనసాగనుంది. అనంతరం అక్టోబర్ 3న ఓటర్ల తుది జాబితాను అధికారికంగా ప్రచురించనున్నారు. ఈ సమగ్ర ప్రక్రియ ఎలాంటి విఘాతం లేకుండా సజావుగా సాగేందుకు వీలుగా, ఇందులో భాగస్వాములైన కీలక అధికారులు అదే స్థానాల్లో కొనసాగాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ మేరకు రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ (సీఈఓ) వివేక్ యాదవ్ ఉత్తర్వులు (జీవో 1545) విడుదల చేశారు. ఎన్నికల సవరణ బాధ్యతల్లో ఉన్న అధికారులు అక్టోబర్ 3న తుది జాబితా వచ్చేంత వరకు తమ స్థానాల నుంచి మారకూడదని ఈ నిర్ణయం పేర్కొంటోంది.

## రాంచీలో ఉవ్వెత్తున విద్యార్థుల నిరసన జ్వాలలు

**మొదటి పేజీ తరువాయి..** నిరసనల తీవ్రత దృష్ట్యా రాంచీలోని పాఠశాలలకు అధికారులు ఇప్పటికే సెలవు ప్రకటించారు. అలాగే ఇతర జిల్లాల నుంచి రాజధానికి వచ్చే వారి సంఖ్యను తగ్గించేందుకు రాష్ట్ర రహదారులు, జిల్లా సరిహద్దులలో పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. గతంలో పేపర్ లీక్ ఉదంతంపై ప్రభుత్వం ప్రత్యేక ప్యానెల్‌ను ఏర్పాటు చేసి పలు దఫాలుగా చర్చలు జరిపినప్పటికీ, ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై నమ్మకం లేని విద్యార్థి లోకం తమ భవిష్యత్తు కోసం పోరాట బాట పట్టింది.

## తక్షణమే కాళేశ్వరం మోటర్లు ఆన్ చేయాలి: మంత్రి ఉత్తమ్‌కు హరీశ్ రావు లేఖ

**హైదరాబాద్**

కాళేశ్వరం ప్రాజెక్టులోని మోటర్లను తక్షణమే ఆన్ చేసి రైతులకు సాగునీటి తిప్పలు తప్పించాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి ఆయన ఒక లేఖ రాశారు. రిజర్వాయర్లలో సకాలంలో నీటిని నింపకపోవడంతో పంటలు సాగు కాక రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని లేఖలో పేర్కొన్నారు. ఎల్ నినో ప్రభావంతో వర్షపాతం తగ్గడం, ప్రాజెక్టుల్లో నీటి మట్టాలు పడిపోవడంతో వానాకాలం పంటల సాగుకు రైతులు నీటి కోసం ఎదురుచూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

మిడ్ మానేరు నుంచి మోటర్ల ద్వారా నీటిని పంపింగ్ చేసి అన్నపూర్ణ, రంగనాయక సాగర్, మల్లన్న సాగర్, కొండపోచమ్మ సాగర్, బస్వాపూర్ రిజర్వాయర్లను తక్షణమే నింపాలని ఆయన కోరారు. దీని ద్వారా సుమారు 4 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరందుతుందని వివరించారు. అలాగే 24 టీఎంసీల పూర్తి సామర్థ్యం కలిగిన లోయర్ మానేరు డ్యామ్‌లో ప్రస్తుతం కేవలం 6.9 టీఎంసీల నీరు మాత్రమే అందుబాటులో ఉందని, మిడ్ మానేరు నుంచి ఎల్ఎమ్‌డీకి నీటిని మళ్లించి శ్రీరామ్‌సాగర్ ప్రాజెక్ట్ (ఎస్సారెస్పీ) స్టేజ్-2 ఆయకట్టు రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. గత యాసంగిలో ఈ రిజర్వాయర్ల కింద 4 లక్షల ఎకరాలు సాగైన విషయాన్ని గుర్తుచేస్తూ, ప్రస్తుత వానాకాలంతో పాటు రాబోయే యాసంగికి కూడా సరిపడా సాగునీరు అందుబాటులో ఉండేలా కాళేశ్వరం అనుబంధ రిజర్వాయర్లన్నింటినీ నీటితో నింపాలని హరీశ్ రావు విజ్ఞప్తి చేశారు.

## తెలంగాణ కోసమే బతికిన పెద్ది

**ప్రజల అభిమానం చూరగొన్న నేత**

**నర్సంపేట కాలేజీఇకి పెద్ది పేరు పెడతాం**

**సంతాపసభలో కేటీఆర్ వెల్లడి**

**నర్సంపేట** :ఎంతకాలం బతికినం అనేది కాదు.. ఎట్లా బతికినం అనేది ముఖ్యం అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. పెద్ది సుదర్శన్ రెడ్డి జీవితమే అందుకు ఉదాహరణ అన్నారు. వరంగల్ జిల్లా నర్సంపేటలో మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి సంస్మరణ సభకు హరీశ్ రావుతో కలిసి హాజరయ్యారు. పెద్ది చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పెద్ది సుదర్శన్ రెడ్డి అంతిమయాత్రకు వేలాది మంది తరలివచ్చారు.

లక్షకు పైగా మంది 12 గంటల పాటు వర్షం పడుతున్నా ఎక్కడికి వెళ్లకుండా అంతిమయాత్రలో పాల్గొన్నారు. ఆయన ఎలాంటి వ్యక్తో తెలుపడానికి ఇదే నిదర్శమన్నారు. పెద్ది కోరుకున్నట్లు వచ్చే రెండేండ్లలో అధికారంలోకి వస్తామన్నారు. మేము అధికారంలోకి వచ్చిన తర్వాత నర్సంపేటలోని మెడికల్ కాలేజీకి పెద్ది సుదర్శన్ రెడ్డి పేరు పెడతామన్నారు. భవిష్యత్ తరాలు గుర్తు చేసుకునే విధంగా ఘన నివాళు లు అర్పిద్దామన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో తెలంగాణ ఉద్యమాన్ని ఒంటిచేత్తో నడిపిన నాయకుడు మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అని బీఆర్ఎస్ కేటీఆర్ అన్నారు. ప్రజల్లో సుదర్శన్‌రెడ్డి పట్ల ఉన్న గౌరవం.. ఆయన అంతిమయాత్రలో పాల్గొన్నవారి సంఖ్యను చూస్తే తెలుస్తోందని చెప్పారు. వరంగల్ జిల్లా నర్సంపేటలో నిర్వహించిన పెద్ది సుదర్శన్ సంస్మరణ సభలో కేటీఆర్ మాట్లాడారు.

తెలంగాణ ఉద్యమ సమయంలో టీఆర్ఎస్ ఏ కార్యక్రమానికి పిలుపునిచ్చినా పెద్ది సుదర్శన్‌రెడ్డి భారీ ఎత్తున నిర్వహించేవారు. ఆయన్ను బతికించుకునేందుకు ఎంత ప్రయత్నం చేయాలో అంతా చేశాం. ఎవరైనా ఎంతకాలం బతికామన్నది ముఖ్యం కాదు.. ఎలా బతికామన్నదే ముఖ్యం. ఎమ్మెల్యేగా ఒక్కసారి గెలిచినా.. జనం గుండెల్లో శాశ్వతంగా నిలిచిపోయేలా ఆయన పనిచేశారు. నర్సంపేటలో నిర్మించే మెడికల్ కాలేజీకి పెద్ది సుదర్శన్‌రెడ్డి పేరు పెడతాం. ఆయన కుటుంబాన్ని కాపాడుకునే బాధ్యతను బీఆర్ఎస్ పార్టీ తీసుకుంటుందని కేటీఆర్ అన్నారు.తెలంగాణ ఉద్యమంలో పార్టీ అధినేత కేసీఆర్ నాయకత్వంలో ఉమ్మడి వరంగల్ జిల్లా కేంద్రంగా సాగిన

## తెలంగాణలో ముగిసిన 'సర్' ఎన్యూమరేషన్ ప్రక్రియ

**మొదటి పేజీ తరువాయి..** గ్రేటర్ హైదరాబాద్ ప్రాంతంలో ప్రక్రియ నెమ్మదించింది. హైదరాబాద్ జిల్లాలో 27,74,687 ఫారాలతో 58.58 శాతం మాత్రమే డిజిటలైజేషన్ పూర్తయి చివరి స్థానంలో ఉండగా, మేడ్చల్-మల్కాజిగిరిలో 63.82 శాతం, రంగారెడ్డిలో 64.91 శాతం మాత్రమే నమోదైంది. ప్రధాన నగరాల్లో రెండుసార్లు గడువు పొడిగించినప్పటికీ ఆశించిన స్థాయిలో శాతం పెరగలేదు. కాగా, ఇతర జిల్లాలైన కుమురం భీమ్ ఆసిఫాబాద్‌లో 89.45 శాతం, జగిత్యాలలో 89.60 శాతం నమోదు కావడం గమనార్హం. ఈ ప్రక్రియ ముగింపుపై ఆగస్టు 12న రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ (సీఈఓ) నుంచి అధికారిక ప్రకటన వెలువడనుంది. షెడ్యూల్ ప్రకారం, ఆగస్టు 17న ముసాయిదా ఓటర్ల జాబితాను విడుదల చేయనున్నారు. ఆ తర్వాత నెల రోజుల పాటు అభ్యంతరాలు, క్లెయిమ్‌ల స్వీకరణ కొనసాగుతుంది. అభ్యంతరాలన్నింటినీ పరిష్కరించిన అనంతరం అక్టోబర్ 19న తుది ఓటర్ల జాబితాను అధికారికంగా ప్రచురించనున్నారు

## అమిత్ షా ప్రకటన చేయాలి

**మొదటి పేజీ తరువాయి..** స్పష్టం చేసింది. సోమవారం పార్లమెంట్ కాంప్లెక్స్‌లో మీడియాతో మాట్లాడిన కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ వాద్రా, విద్యార్థులపై దాడి ఘటనపై అమిత్ షా వెంటనే స్పందించాలని, ఆయన ప్రకటన ఇచ్చేవరకు సభలు సజావుగా సాగనిచ్చేది లేదని తేల్చి చెప్పారు. ఈ ఘటనపై కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ సైతం కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. పోలీసుల లాఠీచార్జ్‌లో పలువురు యువతులు, మైనర్లు తీవ్రంగా గాయపడ్డారని, ఈ ఉదంతంపై అమిత్ షా పార్లమెంట్‌కు వచ్చి జవాబు చెప్పాల్సిందేనని పట్టుబట్టారు. పోలీసుల దాడిపై సుప్రీంకోర్టు పర్యవేక్షణలో నిష్పాక్షిక విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఆందోళన చేస్తున్న విద్యార్థులపై దాడి జరిగి రోజులు గడుస్తున్నా హోంమంత్రి ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. ప్రయాగ్‌రాజ్‌లో జరిగిన కార్యక్రమంలో నీట్ అభ్యర్థి పడిన ఆవేదనను ఈ సందర్భంగా గుర్తుచేసిన రాహుల్, విద్యార్థుల సమస్యలను పట్టించుకోకుండా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు.

## రైతు అతిజాగ్రత్తతో పొలంలో పాతిపెట్టిన 5 లక్షలు చెదలుపాలు రాజస్థాన్‌లో ఘటన

ఇంట్లో వాళ్లకు తెలియకుండా నగదును దాచే ప్రయత్నంలో ఓ రైతు అతిజాగ్రత్త భారీ నష్టాన్ని తెచ్చిపెట్టింది. రాజస్థాన్‌లోని పచ్‌పాద్రాకు చెందిన రైతు మంగీలాల్ మేఘ్వాల్ ఏడాది క్రితం తనకు వచ్చిన రూ.5 లక్షల భూమి విక్రయ సొమ్మును ఇంటి నిర్మాణం కోసం దాచుకోవాలని భావించాడు. అయితే చోరీ భయం, కుటుంబ సభ్యుల ఖర్చుల నుంచి కాపాడుకునేందుకు ఎవరికీ చెప్పకుండా ఆ నగదును పాలిథీన్ బ్యాగ్‌లో చుట్టి పొలంలో పాతిపెట్టాడు. ఆ తర్వాత ఆ డబ్బు అవసరమై వెతకగా తాను పాతిపెట్టిన స్థలాన్ని మరిచిపోవడంతో ఎంత వెతికినా లభించలేదు. ఇటీవల వర్షాలు పడటంతో పొలాన్ని ట్రాక్టర్‌తో దున్నుతుండగా ఆ నోట్ల సంచి బయటపడింది.

తీరా సంచి విప్పి చూసేసరికి నోట్లకు చెదలు పట్టి రూ.5 లక్షల నగదు పనికిరాకుండా పోవడంతో ఆ కుటుంబం తీవ్ర దిగ్భ్రాంతికి గురైంది. పాడైపోయిన నోట్లను మార్చుకునేందుకు స్థానిక పచ్‌పాద్రా, బలోత్రా బ్యాంకులకు వెళ్లగా, పరిస్థితి దారుణంగా ఉండటంతో అధికారులు తిరస్కరించి జైపూర్‌లోని ఆర్బీఐ లేదా ప్రధాన బ్యాంకులను సంప్రదించాలని సూచించారు. దాచుకున్న సొమ్ములో కొంతైనా తిరిగి వస్తుందేమోనని రైతు ఆశగా ఎదురుచూస్తుండగా, పొలంలో డబ్బు పాతిపెట్టి అనవసరంగా నష్టపోయానని పశ్చాత్తాపం వ్యక్తం చేస్తున్నాడు.

స్మార్ట్ రేషన్ కార్డులు విప్లవాత్మక నిర్ణయం

## సిఎం పర్యటన ఏర్పాట్లు పరిశీలించిన జగ్గారెడ్డి

**సంగారెడ్డి** : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలను నెరవేరుస్తోందని, స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ గొప్ప ముందడుగని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అన్నారు. గత పదేళ్లలో ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేక పోయారని, ఇప్పుడు కొత్త కార్డులు ఇవ్ంవడంతో పాటు, స్మార్ట్ కార్డులు కూడా ఇవ్వబోతున్నామని అన్నారు. సిఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ అనేక కార్యక్రమాలు చేపట్టిందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈనెల 15న జిల్లాలో పర్యటించనున్నారు. సంగారెడ్డిలో నూతన స్మార్ట్ రేషన్ కార్డులను సీఎం పంపిణీ చేయనున్నారు. ఈ సందర్భంగా సోమవారం తారా డిగ్రీ కాలేజీలో హెలిప్యాడ్, అంబేద్కర్ స్టేడియంలో సభా స్థలిని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రతిక్ జైన్, ఎస్పీ పరితోష్ పంకజ్ పరిశీలించారు. అనంతరం జగ్గారెడ్డి మాట్లాడుతూ... పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అరకొరగా రేషన్ కార్డులు ఇచ్చారని విమర్శించారు. కోటి 5 లక్షల మందికి కాంగ్రెస్ ప్రభుత్వంలో స్మార్ట్ రేషన్ కార్డులు ఇవ్వబోతున్నామని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ కమిట్‌మెంట్‌తో పని చేస్తోందని జగ్గారెడ్డి తెలిపారు. స్మార్ట్ రేషన్ కార్డులపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, సీఎం రేవంత్ రెడ్డి తీసుకున్న నిర్ణయం హర్షించదగిన విషయమన్నారు. ఇది ప్రభుత్వ కార్యక్రమమైనా కాంగ్రెస్ పార్టీ తరఫున సీఎం రేవంత్‌కు ఘనంగా స్వాగతం పలుకుతామని చెప్పారు. సభని 50 వేల మందితో నిర్వహించేలా ఏర్పాట్లు జరుగుతున్నాయని జగ్గారెడ్డి పేర్కొన్నారు.

## ముచ్చుకోట వద్ద ఉద్రిక్త పరిస్థితులు

**వైకాపా నేతలు పెద్దిరెడ్డి, అనంతల అరెస్ట్**

**అనంతపురం** : వైఎస్సార్‌సీపీ ఆధర్వ్యంలో డిఎస్సీ అక్రమాలపై పోరాటం ఉధృతమైంది. సోమవారం ఉదయం తాడిపత్రి నియోజకవర్గం ముచ్చుకోట వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. తాడిపత్రిలో యువత ర్యాలీకి మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి ఏర్పాట్లు చేశారు. అయితే పోలీసులు మాత్రం ఆ ర్యాలీని అడ్డుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న పుంగనూరు ఎమ్మెల్యే, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తాడిపత్రికి బయల్దేరారు. మార్గమధ్యంలో ముచ్చుకోట వద్ద పోలీసులు ఆయన్ని అడ్డుకోవడంతో.. ఆయన రోడ్డుపైనే బైఠాయించి ఆయన నిరసన తెలియజేశారు. శాంతియుతంగా నిర్వహించే కార్యక్రమాలను ఎలా అడ్డుకుంటారని పోలీసులను పెద్దిరెడ్డి ప్రశ్నించారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ప్రతి ఒక్కరికీ ఉందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పోలీసులతో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు.. మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి మధ్య వాగ్వాదం జరిగింది. వైఎస్సార్‌సీపీ ర్యాలీలను అడ్డుకోవడం దుర్మార్గమని ఆరోపించారు. మనం ప్రజాస్వామ్యంలో ఉన్నామా? డీఎస్సీ అక్రమాలపై సీబీఐ విచారణ ఎందుకు జరపడం లేదు? మంత్రి లోకేశ్ కనుసన్నల్లోనే డీఎస్సీలో అక్రమాలు జరిగాయి. నైతిక బాధ్యతగా ఆయన రాజీనామా చేయాలని పెద్దిరెడ్డి డిమాండ్ చేశారు. పోలీసుల తీరుకు నిరసనగా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ నేతలు అనంతపురం-తాడిపత్రి హైవేపై బైఠాయించారు. పోలీసుల వ్యవహారశైలిపై నేతలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ నేతలు వెంకటరెడ్డి, విశ్వేశ్వర్‌రెడ్డి కూడా పోలీసుల తీరును తప్పుబట్టారు. శాంతియుత కార్యక్రమాలను అడ్డుకోవడం సరికాదని మండిపడ్డారు. డీఎస్సీలో అక్రమాలు జరిగాయంటూ రాష్ట్ర వ్యాప్తంగా వైకాపా నిరసన ర్యాలీలకు పిలుపునిచ్చింది. ఈ నిరసనల్లో పాల్గొనేందుకు అనంతపురం జిల్లా తాడిపత్రికి వెళ్తున్న మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డిలను పోలీసులు ముచ్చుకోట వద్ద అడ్డుకున్నారు. పోలీసుల తీరును నిరసిస్తూ వైకాపా నేతలు అక్కడే బైఠాయించారు. దీంతో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, అనంత వెంకటరామిరెడ్డిలను అదుపులోకి తీసుకుని పోలీసులు అనంతపురం తరలించారు.

## డీఎస్సీ నిర్వహణలో తీవ్ర అవకతవకలు సీబీఐ విచారణకు బొత్స డిమాండ్

**విజయనగరం** : రాష్ట్రంలో డీఎస్సీ నిర్వహణలో తీవ్ర అవకతవకలు జరిగాయని, దీనిపై వెంటనే సీబీఐ విచారణ జరిపించాలని వైఎస్సార్‌సీపీ నాయకుడు బొత్స సత్యనారాయణ డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వంపై విమర్శల డాడి చేశారు. విచారణ పూర్తయ్యే వరకు సంబంధిత మంత్రిని పదవి నుంచి పక్కన పెట్టాలని స్పష్టం చేశారు. యువత, నిరుద్యోగులు తమ సమస్యలపై గత డెబ్బై రోజులకు పైగా పోరాటం చేస్తున్నారని, వారు ర్యాలీలు చేయడానికి ప్రయత్నిస్తే పోలీసులు అడ్డుకోవడం సరికాదని మండిపడ్డారు. వెనక్కి వెళ్తామన్నా ఒప్పుకోకుండా, కనీసం శాంతియుత ర్యాలీలకు కూడా అనుమతులు ఇవ్వడం లేదని ఆరోపించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాటలకు, చేతలకు పొంతన ఉండటం లేదని విమర్శించారు. వచ్చే ఆదాయంలో సగం డబ్బులు ఉద్యోగుల జీతాలకే సరిపోతున్నాయని చెబుతున్న చంద్రబాబు, ఎన్నికల ముందు చెప్పిన సంపద సృష్టి ఏమైందో సమాధానం చెప్పాలన్నారు. ఒకవైపు సంపద సృష్టిస్తామని చెప్పి, మరోవైపు రాష్టాన్ని తీవ్ర అప్పుల పాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. అసలు ఏ రంగంలో అభివృద్ధి సాధించారో చంద్రబాబు స్పష్టత ఇవ్వాలని సవాల్ విసిరారు. వైద్య రంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేశారని, పేదలకు వరమైన ఆరోగ్యశ్రీ పథకానికి తూట్లు పొడిచారని బొత్స ఆవేదన వ్యక్తం చేశారు. రాష్టాన్ని పట్టించుకోకుండా కేవలం అమరావతి జపం మాత్రమే చేస్తున్నారన్నారు. మరోవైపు రైతులకు ఏ పంటకూ కనీస మద్దతు ధర లభించడం లేదని వాపోయారు. ఈ ప్రభుత్వం కేవలం వ్యక్తిగత స్వార్థపూరిత ప్రయోజనాల కోసమే పనిచేస్తోందని, ఇలాంటి ప్రభుత్వాన్ని సాగనంపాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని, ఆడపిల్లలు బయటకు రావాలంటేనే తీవ్ర భయాందోళనలకు గురయ్యే పరిస్థితి నెలకొందని బొత్స సత్యనారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు.

## నిరసనల ర్యాలీలకు ప్రజల్లో అనూహ్య స్పందన

**డిఎస్సీ అక్రమాలపై వైసిపి పోరాటం సక్సెస్**

**పార్టీ స్టేట్ కో-ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి**

**అమరావతి** : వైఎస్సార్‌సీపీ నిరసన ర్యాలీలకు ప్రజల నుంచి అనూహ్య స్పందన వస్తుందని పార్టీ స్టేట్ కో-ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి స్పష్టం చేశారు. తాజాగా డీఎస్సీ అక్రమాలపై వైఎస్సార్‌సీపీ చేపట్టిన రాష్ట్ర వ్యాప్త నిరసన ర్యాలీలు విజయవంతం కావడంతో సజ్జల మీడియాతో మాట్లాడారు. తాము అడిగిన దాంట్లో వాస్తవం లేకపోతే ప్రజల నుంచి ఇంత స్పందన ఎలా వస్తుందని ప్రశ్నించారు. 'వైఎస్సార్‌సీపీ నిరసన ర్యాలీలకు ప్రజల నుంచి అనూహ్యమైన స్పందన లభిస్తోంది. డీఎస్సీ అక్రమాలపై కూటమి ప్రభుత్వం సమాధానం చెప్పడం లేదు. నిరసనలపై కూటమి నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారు. మా పోరాటాలను అణచివేయాలని చూస్తున్నారు. వైఎస్సార్‌సీపీ ర్యాలీలు విజయవంతమయ్యాయి. వైఎస్సార్‌సీపీ చేపట్టిన ప్రతి కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన వస్తోంది. నిరసన కార్యక్రమాలను ఓ ఉద్యమంలా ముందుకు తీసుకెళ్తున్నాం. అందుకే వైఎస్సార్‌సీపీ పోరాటాను అణగదొక్కాలనే ప్రయత్నం చేస్తున్నారు. డీఎస్సీలో అక్రమాలు జరిగింది వాస్తవం కాబట్టే చంద్రబాబు ఉలిక్కిపడుతున్నారు. ఈ స్కాం నుంచి చంద్రబాబు, లోకేష్ తప్పించుకోలేరు. డీఎస్సీ అక్రమాలపై కూటమి ప్రభుత్వం సమాధానం చెప్పడం లేదు. నిరసనలపై కూటమి నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఇప్పటివరకూ ఇవ్వలేదు. మేం అడిగిన ప్రశ్నలకు ప్రభుత్వం సమాధానం చెప్పలేకపోతోంది. డీఎస్సీలో అక్రమాలు జరిగినట్లు క్లియర్‌గా తెలుస్తోంది. ఉన్నతస్థాయిలోనే తప్పు జరిగిందనే విషయం అర్థమవుతోంది. అక్రమాలు జరిగాయి కాబట్టే సీబీఐ విచారణకు భయపడుతున్నారు. లీకేజీ జరిగిందనడానికి తిరుగులేని ఆధారాలున్నాయిఒక తప్పును కవర్ చేయడానికి తప్పుల మీద తప్పులు చేశారు. అక్రమాలు బయటకు రావడంతో సర్టిఫికెట్లు కూడా టాంపర్ చేసి మార్చారు' అని సజ్జల ధ్వజమెత్తారు.

# ప్రజాస్వామ్యం పరిరక్షణకు మార్పు అవసరం

- శ్రీరాముని నిధులకే టోకార వేసిన గనులు
- సిపిఐ జన చైతన్య యాత్రలో దండి సురేష్

కారేపల్లి, ఆగస్టు 10 (జన సంఘర్షణ) న్యూస్

కారేపల్లి: దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాద అంచున ఉందని ప్రజాస్వామ్య పరిరక్షణకు మార్పు అత్యవసరమని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ తెలిపారు ప్రజలను చైతన్యవంతం చేసేందుకే మార్పు కోరుతూ గ్రామ గ్రామాన సిపిఐ జన చైతన్యా యాత్ర చేపట్టిందని ఆయన తెలిపారు. సోమవారం సిపిఐ జన చైతన్య యాత్ర మండల పరిధిలోని పలు గ్రామాల్లో జరిగింది. ఈ సందర్భంగా మాదారం కారేపల్లి కారేపల్లి క్రాస్ రోడ్‌లో జరిగిన సభలో సురేష్ మాట్లాడుతూ.. ఏ హామీలు ఇచ్చి మోడీ 12 సంవత్సరాల క్రితం అధికారంలోకి వచ్చారో కేంద్ర ప్రభుత్వం ఏ ఒక్కటీ అమలు చేయలేదన్నారు. హామీలు అమలు చేయకపోగా ప్రజలను ఇబ్బంది పెడుతూ బతకలేని స్థితికి నెట్టి వేశారని సురేష్ తెలిపారు రైతాంగం ఆర్థిక పరిస్థితిని మెరుగు పరచక పోగా వ్యవసాయ రంగాన్ని మరింత సంక్షోభంలోకి నెట్టివేశారని రసానిక ఎరువులు పురుగు మందులు ధరలను ఐదు సంవత్సరాల్లోనే రెట్టింపు చేశారన్నారు. లక్షల కోట్లు కార్పొరేట్ అధిపతులకు అప్పులను రద్దు చేసిన మోడీ సర్కార్ రైతంగానికి చెందిన నయా పైసా అప్పులను కూడా రద్దు చేయలేదని ఇది మోడీ కార్పొరేట్ ప్రేమకు రైతుల పట్ల వివక్షతకు నిదర్శనమని అన్నారు. జయరామంటూ రామనామాన్ని జపిస్తూ రాముడి నిధులకే టోపీ పెట్టారని అయోధ్య రామాలయంలో నిధులను కాజేసిన వ్యక్తులపై చర్యలకు సిపిఐ డిమాండ్ చేస్తుందన్నారు. మోడీ విధానాలు సంపూర్ణల వర్గాలకు వరంగా మారుతున్నాయని అందుకే కార్పొరేట్లను మోడీ పాలనను కోరుకుంటున్నారని సురేష్ తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వందలాది హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని ఉచిత బస్సు సన్నబియ్యం తప్ప ఏ హామీలను నెరవేర్చలేదని మిగిలిన హామీలు అమ్ములు గురించి కనీసం పట్టించుకోవడంలేదని సురేష్ తెలిపారు. రుణమాఫీలో ఘోరంగా విఫలమైందని 50% రుణమాఫీ సక్రమ పద్ధతిలో జరగలేదన్నారు జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు రుణమాఫీ పై వివిధ సందర్భాలు ఇచ్చిన హామీల హామీపై ఎప్పుడూ స్పందించడం లేదన్నారు నిరక్షరాస్యులు అయిన రైతల పట్ల యూరియా యాప్ శాపంగా మారిందని బహిరంగంగా మార్కెట్లో ఎరువులు అందుబాటులో ఉంచాలని సిపిఐ డిమాండ్ చేస్తుంది అన్నారు . ప్రభుత్వ శాఖలలో లోపించిన జవాబిదరితనం పైన మంత్రుల స్పందించాలని ప్రభుత్వ కార్యాలయాలకు సామాన్యుడు వెళ్లే పరిస్థితి లేదన్నారు. అనేక చారిత్రిక పోరాటాలతో హక్కులను పథకాలను సక్రమంగా సాధించిందని సిపిఐ ఎప్పుడు ఎన్నికల సందర్భంగా మోడీ రాష్ట్రంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు




చేయాలని డిమాండ్ చేస్తుందని తగు రీతులో స్పందించకపోతే పోరాటాలు ప్రజా అగ్రహాన్ని ఎదురుకొక తప్పదని సురేష్ వివరించారు. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి రాష్ట్ర సమితి సభ్యులు యాత్రబాబు ఏపూరి లతా తదితరులు ప్రసంగించగా జిల్లా కార్యవర్గ సభ్యులు అజ్మీర్ రామ్మూర్తి రావి శివరామకృష్ణ పోటు కళావతి సిహెచ్ సీతామహాలక్ష్మి యంగళ అనందరావు జిల్లా నాయకులు శ్రావణ్ తాటి నిర్మల పుచ్చకాయల వెంకటేశ్వర్లు తాతా వెంకటేశ్వర్లు వీరు నాయక్ ఉంగరాల సుధాకర్ రావు చెన్నం శెట్టి భూసయ్య దల్ సింగ్ పుచ్చకాయల శ్రీను బట్టు సంగయ్య బొమ్మల కృష్ణ రాయల రామారావు అమ్మర్ జానీ తదితరులు పాల్గొనగా మాదారం మాజీ సర్పంచ్ పలువురు కాంగ్రెస్ నాయకులు సంఘీభావం తెలిపారు.

# కొత్తపల్లి వద్ద బ్రిడ్జిపై అప్రోచ్ రోడ్డు ఎప్పుడు?

- వారం రోజుల్లో అప్రోచ్ రోడ్డు పనులు ప్రారంభించాలి.
- లేకుంటే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో భారీ ధర్నా.
- ప్రతిపక్షాలను తిట్టడం మానుకుని అభివృద్ధిపై దృష్టి పెట్టండి.
- మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్ రెడ్డి.

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 10 (జన సంఘర్షణ)





మెదక్ నుంచి బొడ్మెట్‌పల్లి వెళ్లే ప్రధాన మార్గంలోని కొత్తపల్లి వద్ద బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన బ్రిడ్జిపై అప్రోచ్ రోడ్డు నిర్మాణం చేపట్టకపోవడంపై మాజీ డిప్యూటీ స్పీకర్ ఎం. పద్మా దేవేందర్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం పాపన్నపేట మండల నాయకులతో కలిసి కొత్తపల్లి వద్ద బ్రిడ్జిని పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడి నుంచి రాకపోకలు సాగిస్తున్న వాహనదారులతో మాట్లాడి, బ్రిడ్జి వద్ద ఎదురవుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పద్మా దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ.. కేసీఆర్ హయాంలో తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో రూ. 1.40 కోట్లతో కొత్తపల్లి వద్ద బ్రిడ్జి నిర్మించామని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం బ్రిడ్జి నిర్మాణాన్ని పూర్తి చేసినప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండుమూడేళ్లు కావస్తున్నా బ్రిడ్జిపై అప్రోచ్ రోడ్డు నిర్మించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే పదవిలోకి వచ్చి రెండేళ్ల తొమ్మిది నెలలు గడిచినా కొత్తపల్లి బ్రిడ్జిపై కనీసం అప్రోచ్ రోడ్డు నిర్మాణం చేపట్టకపోవడం దారుణమన్నారు. అప్రోచ్ రోడ్డు లేకపోవడంతో మెదక్--బొడ్మెట్‌పల్లి మార్గంలో ప్రయాణించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, బ్రిడ్జి వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. ఇప్పటికే పలువురు ప్రమాదాల బారినపడి ప్రాణాలు కోల్పోయినా ప్రభుత్వం, అధికార యంత్రాంగం స్పందించకపోవడం బాధాకరమన్నారు. ప్రజల ప్రాణాలు పోతున్నా ప్రభుత్వానికి, అధికార యంత్రాంగానికి పట్టదా? అని ప్రశ్నించారు. జిల్లా కలెక్టర్, ఆర్అండ్‌బీ అధికారులు, స్థానిక ఎమ్మెల్యే ఈ విషయంపై వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు. కొత్తపల్లి బ్రిడ్జిపై అప్రోచ్ రోడ్డు నిర్మాణ పనులను తక్షణమే చేపట్టి ప్రజల ఇబ్బందులు తొలగించాలని కోరారు. ప్రతిపక్షాలను తిట్టడం మానుకుని అభివృద్ధిపై దృష్టి పెట్టాలని పద్మా దేవేందర్ రెడ్డి సూచించారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడంపై ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు దృష్టి సారించాలని అన్నారు. రాజకీయ విమర్శలకు సమయం కేటాయించే బదులు ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని హితవు పలికారు. వారం రోజుల్లోగా అప్రోచ్ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించకపోతే బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ధర్నా నిర్వహిస్తామని పద్మా దేవేందర్ రెడ్డి హెచ్చరించారు. ప్రజల సమస్య పరిష్కారమయ్యే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. వీరి వెంటమాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకటరామిరెడ్డి, కొడపాక సర్పంచ్ పంకజ కాశీనాథ్‌రావు, మాజీ సర్పంచ్‌లు శ్రీనాథ్‌రావు, బద్రి మల్లేశం, నాయకులు సోములు, దుర్గయ్య, అనిల్‌రెడ్డి, బాబాగౌడ్, అంతోని, శ్రీనివాస్‌గౌడ్, మేడిశెట్టి రాము, దండం సామేల్, మల్లేశం, చంద్రన్న తదితరులు ఉన్నారు.

# ఆగస్టు 15న భారీ భజన కార్యక్రమం

- వేల గొంతులు ఒకే భజన
- కరపత్రం విడుదల చేసిన రామభక్త భజన పరివార్.

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 10 (జన సంఘర్షణ)




మెదక్ పట్టణంలోని చమన్ వద్ద వున్నా హనుమాన్ దేవాలయంలో సమాజ ఐక్యతను చాటేలా ఆగస్టు 15న మెదక్ పట్టణంలో భారీ భజన కార్యక్రమాన్ని నిర్వహించేందుకు భారీ భజన కార్యక్రమం నిర్వహించేందుకు సన్నాహాలుచేస్తున్నారు. రామభక్త భజన పరివార్ సభ్యులతో పాటు భజన భక్తులు కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను శనివారం విడుదల చేశారు. రామభక్త భజన పరివార్ ఆధ్వర్యంలో ప్రతి శనివారం చామన్‌లోని శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో భజన కార్యక్రమాలునిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఐదో వారం భజన కార్యక్రమాన్ని ఆగస్టు 15న సాయంత్రం 5 గంటలకు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి వేలాది మంది భక్తులు హాజరయ్యేలా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. భక్తులు, హిందూ బంధువులు కుటుంబ సమేతంగా పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. భజన కార్యక్రమం ద్వారా హిందువుల ఐక్యత, ధార్మిక చైతన్యాన్ని చాటాలని పిలుపునిచ్చారు.

# హైదరాబాద్‌లో రాధా రంగా మిత్ర మండలి చారిటబుల్ ట్రస్ట్ ప్రమాణ స్వీకార మహోత్సవం

- ఖమ్మం జిల్లా అధ్యక్షుడిగా షేక్ షరీఫ్ పాషా (షరీఫ్ రంగా)

సింగరేణి ప్రతినిధి: (జన సంఘర్షణ) న్యూస్



హైదరాబాద్‌లో నిర్వహించిన ఆంధ్ర-తెలంగాణ రాధా రంగా మిత్ర మండలి చారిటబుల్ ట్రస్ట్ సభ్యుల ప్రమాణ స్వీకార మహోత్సవ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా సింగరేణి మండలం పేరుపల్లి గ్రామానికి చెందిన షేక్ షరీఫ్ పాషా (షరీఫ్ రంగా) పాల్గొన్నారు. రాధా రంగా మిత్ర మండలి ఖమ్మం జిల్లా అధ్యక్షుడిగా షరీఫ్ రంగా నియమితులైన సందర్భంగా ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు కాళ్లపాలెం బుజ్జి నియామక పత్రాన్ని ఆయనకు అందజేశారు. అనంతరం వంగవీటి వారసులు, వంగవీటి శాంతన్ కుమార్ తనయుడు వంగవీటి జూనియర్ మోహన రంగా షరీఫ్ రంగాను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా షరీఫ్ రంగా మాట్లాడుతూ.. తనను ఖమ్మం జిల్లా అధ్యక్షుడిగా నియమించిన ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు కాళ్లపాలెం బుజ్జి గారికి, ట్రస్ట్ సభ్యులందరికీ పేరుపేరునా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. తనకు అప్పగించిన పదవికి అన్ని విధాలుగా న్యాయం చేస్తానని, ట్రస్ట్ నియమ నిబంధనలను పాటిస్తూ కుల, మత, రాజకీయ పార్టీల ప్రస్తావన లేకుండా ట్రస్ట్ సేవలను ప్రజలకు అందేలా కృషి చేస్తానని పేర్కొన్నారు. ప్రజలకు సేవ చేయడమే లక్ష్యంగా ట్రస్ట్ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లేందుకు తన వంతు కృషి చేస్తానని షరీఫ్ రంగా తెలిపారు.

# రామాయంపేట 500 అడుగుల భారీ జాతీయ జెండాతో ఘనంగా తిరంగా యాత్ర

- రామాయంపేట పట్టణంలో ఆగస్టు 11న తిరంగా యాత్ర.
- భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రాగి రాములు తెలిపారు.

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 10(జన సంఘర్షణ)



భారతదేశం ప్రపంచంలోనే విశ్వగురువుగా ఎదుగుతున్న తరుణంలో, దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న తిరంగా యాత్రలో భాగంగా రామాయంపేట పట్టణంలో 500 అడుగుల భారీ జాతీయ జెండాతో ఘనంగా తిరంగా యాత్ర నిర్వహించనున్నట్లు భారతీయ జనతా పార్టీ నాయకులు తెలిపారు. ఈ తిరంగా యాత్రకు రామాయంపేట పట్టణంలోని అన్ని రాజకీయ పార్టీల నాయకులు, కుల సంఘాలు, వ్యాపార సంఘాలు,యువజన సంఘాలు, విద్యార్థులు, ప్రభుత్వ అధికారులు, మీడియా ప్రతినిధులు, దేశభక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

తేదీ: 11-08-2026, మంగళవారం
సమయం: ఉదయం 10:00 గంటలకు
ప్రారంభ స్థలం: శివాజీ విగ్రహం
ర్యాలీ మార్గం: రామాయంపేట పట్టణ పురవీధుల మీదుగా ఈ కార్యక్రమానికి భారతీయ జనతా పార్టీ మెదక్ జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ మల్లేష్ గౌడ్, ముఖ్య అతిథిగా విచ్చేయనున్నారు. దేశభక్తిని, జాతీయ సమైక్యతను చాటిచెప్పే ఈ తిరంగా యాత్రలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై జాతీయ జెండా పట్ల గౌరవాన్ని, దేశం పట్ల మనకున్న బాధ్యతను చాటాలని నిర్వాహకులు కోరారు. “క్షణ క్షణం మా కణ కణం భరతమాతకే సమర్పణం.

# సర్పంచ్ మల్లేశం కుటుంబాన్ని పరామర్శించిన పద్మా దేవేందర్ రెడ్డి

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 10 (జన సంఘర్షణ)



మెదక్ జిల్లా పాపన్నపేట మండలం నర్సింగి గ్రామ సర్పంచ్ ధారబోయిన మల్లేశం తల్లి ఇటీవల మృతి చెందిన విషయం తెలుసుకున్న మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్ రెడ్డి సోమవారం వారి కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా మల్లేశంతో పాటు కుటుంబ సభ్యులను ఓదార్చి, మృతురాలి మృతికి ప్రగాఢ సంతాపం తెలిపారు. కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పిస్తూ, వారి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. వీరి వెంట మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకటరామిరెడ్డి, కొడపాక సర్పంచ్ పంకజ కాశీనాథ్ రావు, మాజీ సర్పంచ్‌లు శ్రీనాథ్ రావు, బద్రి. మల్లేశం, నాయకులు సోములు, దుర్గయ్య, అనిల్ రెడ్డి, బాబా గౌడ్,అంతోని, శ్రీనివాస్ గౌడ్, మేడిశెట్టి రాము,దండం సామెల్, మల్లేశం చంద్రన్న తదితరులు ఉన్నారు.

# మృతుల కుటుంబాలను పరామర్శించిన పద్మాదేవేందర్ రెడ్డి

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 10 (జన సంఘర్షణ)



రాజిపేట, గాజిరెడ్డిపల్లి గ్రామాల్లో బాధిత కుటుంబాలకు పరామర్శ ఆర్థిక సహాయం అందజేసిన మాజీ ఎమ్మెల్యే, పద్మా దేవేందర్ రెడ్డి. ఇటీవల మృతి చెందిన మూడు కుటుంబాలను మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్ రెడ్డి పరామర్శించి, బాధిత కుటుంబాలకు అండగా నిలిచారు. గాజిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన అరిగే సత్తమ్మ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలుసుకున్న ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అదేవిధంగా రాజిపేట గ్రామానికి చెందిన గౌడ సంఘం అధ్యక్షుడు దామరంచ నారాగౌడ్ అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకుని ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. నారాగౌడ్ మృతి గౌడ సంఘానికి, గ్రామానికి తీరని లోటని పేర్కొంటూ కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. అదే గ్రామానికి చెందిన తిగుళ్ల నర్సవ అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకున్న పద్మాదేవేందర్ రెడ్డి ఆమె కుటుంబాన్ని కూడా పరామర్శించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపి, రూ. 5 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మూడు కుటుంబాలకు అన్ని విధాలుగా అండగా ఉంటామని పద్మాదేవేందర్ రెడ్డి భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ మాజీ ఉపాధ్యక్షురాలు ఏం లావణ్య రెడ్డి, గాజిరెడ్డిరెడ్డి పల్లి ఉప సర్పంచ్ సుధాకర్, బూరుపల్లి ఉపసర్పంచ్ లెంక.రాజు, వార్డు సభ్యులు లస్కర్, మహిపాల్, సురేష్, కొత్తపల్లి సర్పంచ్ నార్ల.సాయిలు నాయకులు రామచంద్రారెడ్డి, సాప. సాయిలు, సాయ గౌడ్, సాప. శ్రీనివాస్, కిషన్, దాసు, రవి, శ్రీను, సత్తయ్య, బాలయ్య, రామ గౌడ్, పోచయ్య, రాజ్ పేట్ గ్రామ బిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం తెలుగు దినపత్రిక
మంగళవారం 11 ఆగస్టు 2026

# కొల్లూరు రోడ్డుపై ఇంత నిర్లక్ష్యమా..?

- నిర్మాణ పనులు వెంటనే చేపట్టాలి.. అధికారులకు ప్రజల హెచ్చరిక
- కాంట్రాక్టర్ తీరుతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు.. స్పందించకపోతే ఆందోళన తప్పదని స్పష్టం

కొల్లూరు/, ఆగస్టు 10:/జన సంఘర్షణ

కొల్లూరు ప్రధాన రహదారి నిర్మాణ పనులు ఎప్పుడు పూర్తవుతాయో తెలియక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నెలలు గడుస్తున్నా రహదారి పనులు ముందుకు సాగకపోవడంతో అధికారుల పర్యవేక్షణ, కాంట్రాక్టర్ పనితీరుపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన రహదారి అధ్వానంగా మారడంతో నిత్యం రాకపోకలు సాగించే ప్రజలు, వాహనదారులు నరకయాతన అనుభవిస్తున్నారు. రహదారిపై గుంతలు, మట్టి, దుమ్ము కారణంగా చిన్నపాటి వర్షానికే పరిస్థితి మరింత దారుణంగా మారుతోంది. ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడే ప్రమాదం ఉండటంతో పాటు, అత్యవసర సమయాల్లో అంబులెన్స్‌లు, ఇతర వాహనాలు సైతం సకాలంలో వెళ్లలేని పరిస్థితి నెలకొంది.



**ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారా..?**

రహదారి పరిస్థితి అధికారులకు కనిపించడం లేదా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. పనులు చేపట్టాల్సిన కాంట్రాక్టర్ నిర్లక్ష్యం చేస్తున్నా సంబంధిత అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని నిలదీస్తున్నారు. ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నప్పటికీ సమస్యను పట్టించుకోకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని మండిపడుతున్నారు.

**ఇకనైనా సంబంధిత అధికారులు...**

స్పందించి కొల్లూరు ప్రధాన రహదారి నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించి, నాణ్యతా ప్రమాణాలతో నిర్ణీత గడువులో పూర్తి చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. తాత్కాలికంగా అయినా గుంతలను పూడ్చి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. "ఇకపై కూడా అధికారులు, కాంట్రాక్టర్ ఇదే నిర్లక్ష్య... ధోరణిని కొనసాగిస్తే చూస్తూ ఊరుకోం. ప్రజలను సమీకరించి రోడ్డుపైకి వచ్చి ఆందోళన చేపడతాం" అని స్థానికులు హెచ్చరించారు. ప్రజల సహనాన్ని పరీక్షించకుండా వెంటనే పనులు ప్రారంభించి రహదారిని అందుబాటులోకి తీసుకురావాలని వారు స్పష్టం చేశారు.

# వర్షాల కోసం మొసలికి పూజలు..

- వైరల్‌గా మారిన వీడియో!
- "కృష్ణా పుష్కర ఘాట్‌లో వింత ఘటన..
- మొసలికి ఎదురుగా కూర్చొని మంత్రాలు జపించిన పూజారి

జోగులాంబ గద్వాల,/ ఆగస్టు 10:/(జన సంఘర్షణ)

వర్షాలు కురవాలని కప్పలకు, గాడిదలకు పెళ్లిళ్లు చేయడం.. బొడ్రాయికి అభిషేకాలు నిర్వహించడం వంటి వింత ఆచారాలు ఇప్పటివరకు చూశాం. కానీ వర్షాల కోసం ఏకంగా మొసలికి పూజలు చేయడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. జోగులాంబ గద్వాల జిల్లాలో చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. బీచుపల్లి కృష్ణా నది పుష్కర ఘాట్ వద్దకు ఓ మొసలి కొట్టుకొచ్చింది. ఘాట్‌లో మొసలిని చూసిన భక్తులు, సందర్శకులు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. అయితే పుష్కర ఘాట్ పురోహితుడు అనిల్ శర్మ మాత్రం ఏమాత్రం భయపడకుండా మొసలికి ఎదురుగా కూర్చున్నారు. అనంతరం మంత్రాలు జపిస్తూ కుంకుమ, పసుపు, పుష్పాలతో మొసలికి పూజలు నిర్వహించారు.

**పూజారి మొసలికి ఎదురుగా కూర్చొని పూజలు...**

చేస్తున్న సమయంలో అది కూడా మౌనంగా, ప్రశాంతంగా కదలకుండా ఉండిపోవడం అక్కడున్న వారిని ఆశ్చర్యానికి గురిచేసింది. ఈ దృశ్యాలను కొందరు భక్తులు ఆసక్తిగా వీక్షించగా, మరికొందరు వీడియోలు తీసి సోషల్ మీడియాలో పోస్టు చేయడంతో ఘటన వైరల్‌గా మారింది. మొసలిని వరుణదేవుడి వాహనంగా భావించి.. వర్షాలు సమృద్ధిగా కురవాలని కోరుతూ పూజలు నిర్వహించినట్లు పురోహితుడు అనిల్ శర్మ తెలిపారు. దీంతో ఈ ఘటనపై భక్తుల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

**వన్యప్రాణుల నిపుణుల హెచ్చరిక...**

మొసలికి అంత దగ్గరగా వెళ్లడం ప్రమాదకరమని, అది ఎప్పుడు దాడి చేస్తుందో చెప్పలేమని వన్యప్రాణి నిపుణులు హెచ్చరిస్తున్నారు. వన్యప్రాణుల విషయంలో భక్తి, ఆసక్తి కంటే భద్రతకే ప్రాధాన్యం ఇవ్వాలని సూచిస్తున్నారు.

**అటవీ సిబ్బంది సురక్షితంగా తరలింపు**



ఘాట్‌లో మొసలి ఉన్న విషయాన్ని స్థానిక పోలీసులు, అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. వెంటనే అక్కడికి చేరుకున్న పోలీసులు, అటవీ సిబ్బంది మొసలిని సురక్షితంగా బంధించి, కొంత దూరంలోని నదిలో విడిచిపెట్టారు. దీంతో భక్తులు, స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. వర్షాల కోసం మొసలికి పూజలు.. మొసలి మాత్రం మౌనంగా ఉండిపోవడం.. ఈ అరుదైన దృశ్యాలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో ఈ ఘటన జోగులాంబ గద్వాల జిల్లాలో హాట్‌టాపిక్‌గా మారింది.

# పోతంగల్ చెరువులో వ్యక్తి మృతదేహం.. గాలింపు వలలో చిక్కుకున్న శవం

- ఇంట్లో నుంచి వెళ్లిన వ్యక్తి చెరువులో విగతజీవిగా.. భర్తను గుర్తించిన భార్య

పోతంగల్, /ఆగస్టు 10/జన సంఘర్షణ):

పోతంగల్ గ్రామంలో విషాద ఘటన చోటుచేసుకుంది. గ్రామ చెరువులో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమవడంతో స్థానికంగా కలకలం రేగింది. మృతదేహాన్ని పరిశీలించిన కుటుంబ సభ్యులు తమ వ్యక్తిగానే గుర్తించారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పోతంగల్ గ్రామానికి చెందిన ధమ్మి రామవ్వ భర్త లక్ష్మణ్ (31), తండ్రి మాణిక్యం ఈ నెల 8వ తేదీ సాయంత్రం 6 గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. అనంతరం ఆయన ఇంటికి తిరిగి రాలేదు. కాగా, సోమవారం ఉదయం సుమారు 8 గంటల సమయంలో పోతంగల్ గ్రామస్తుల ద్వారా చెరువులో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం ఉన్నట్లు కుటుంబ సభ్యులకు సమాచారం అందింది. దీంతో వారు వెంటనే చెరువు వద్దకు చేరుకుని మృతదేహాన్ని బయటకు తీశారు. మృతదేహాన్ని పరిశీలించగా అది తమ కుటుంబ సభ్యుడు లక్ష్మణ్‌దేనని గుర్తించారు. మృతదేహం చుట్టూ చేపలు పట్టేందుకు ఉపయోగించే వల చుట్టుకుని ఉండటం గమనించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ ఘటనపై మృతుడి భార్య ధమ్మి రామవ్వ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. లక్ష్మణ్ చెరువులోకి ఎలా వెళ్లాడు? ప్రమాదవశాత్తు మునిగిపోయాడా? లేక ఘటన వెనుక మరేదైనా కారణం ఉందా? అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నివేదిక, దర్యాప్తులో వెల్లడయ్యే వివరాల ఆధారంగా మృతికి అసలు కారణం స్పష్టమయ్యే అవకాశం ఉంది.



# అనారోగ్య కారణాలతో మృతి చెందిన కుటుంబాన్ని ఆదుకుంటాం

- కాంగ్రెస్ పార్టీ నాయకుడు, ఇలా గ్రూప్ చైర్మన్ డాక్టర్ మోహన్ నాయక్ తెలిపారు.

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 10 (జన సంఘర్షణ)



దుబ్బాక నియోజకవర్గం చేగుంట మండలం గొల్లపల్లి గ్రామానికి చెందిన లాలు ఆరోగ్య సమస్య కారణంతో నర్సింగి చారి హాస్పిటల్లో అడ్మిట్ అయి ఆపరేషన్ చేయించు కున్నారు. వారి కుటుంబ ఆర్థిక పరిస్థితిని గమనించి ఇట్టి సమాచారాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకుడు లీలా గ్రూప్ చైర్మన్ డాక్టర్ మోహన్ నాయక్‌కి తెలియజేయగా హాస్పిటల్‌కు చేరుకొని వారిని కలిసి పరామర్శించి ఆరోగ్య సమస్యల గురించి డాక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. హాస్పిటల్ బిల్ వచ్చిన తర్వాత దాన్నిబట్టి ఆర్థిక సహాయం అందిస్తానని మాట ఇచ్చారు.ఈ కార్యక్రమంలో రాజు, రాము, బాబు, తారాసింగ్, బాలకృష్ణ, పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# హర్ ఘర్ తిరంగా దేశభక్తికి ప్రతీక

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 10 (జన సంఘర్షణ)



జెండా అంటే కేవలం మూడు రంగుల వస్త్రం కాదు మన త్యాగాలకు ప్రతీక, మన దేశ గౌరవానికి ప్రతీక, మన భారతీయుల ఐక్యతకు ప్రతీక అని మెదక్ జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు డాక్టర్ పట్లోళ్ళ మల్లిక అశోక్ అన్నారు. ప్రతీ ఒక్కరు ఇంటిపై జాతీయ జెండాను ఆవిష్కరించి హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగస్వాములఅయ్యారని తెలిపారు.ఈ సందర్భంగా ప్రతి భారతీయుడికి మన భారతదేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పిలుపు మేరకు ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకం ఎగరాలని ప్రతి హృదయంలో భారతమాతపై గర్వం నిండాలని కులం, మతం, ప్రాంతం అనే భేదాలు పక్కనపెట్టి, ముందుగా మనం భారతీయులం అనే భావనతో దేశ ఐక్యతను చాటుదామని పిలుపు ఇచ్చారు బీజేపీ కార్యకర్త, ప్రతి దేశభక్తుడు, ప్రతి కుటుంబం ఈ కార్యక్రమంలో భాగస్వాములై మన జాతీయ జెండాకు గౌరవం అందిద్దామని జెండా గౌరవం మన దేశంగర్వం ఐక్యతే బలం అని సందేశం ఇచ్చారు.

# ప్రతీ ఇంటిపై హార్గర్ తిరంగా జండా ఎగురవేయాలి

- బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు వడ్ల సంతోష్ చారి.



ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 10 (జన సంఘర్షణ)

ప్రతీ ఇంటిపై హార్గర్ తిరంగా జండా ఎగురవేయాలని బీజేపీ పాపన్నపేట మండల పార్టీ అధ్యక్షుడు వడ్లసంతోష్ చారి పిలుపునిచ్చారు. సోమవారం పాపన్నపేట మండల పరిధిలో కొత్తపల్లి ఫంక్షన్ హాల్‌లో హర్గర్ తిరంగా కార్యక్రమాన్ని వడ్ల సంతోష్ చారి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ ప్రధాని నరేంద్ర మోడీ పిలుపుమేరకు ఇంటింటికి జెండా పండగ కార్యక్రమాన్ని నిర్వహించే దిశగా "హర్ ఘర్ తిరంగా" కార్యక్రమాన్ని ప్రతి గ్రామానికి ప్రతి ఇంటికి చేరవేసే ఉద్దేశంతో సన్నాహక సమావేశం నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర ఓబీసీ మోర్చా కార్యవర్గ సభ్యులు గడ్డం కాశీనాథ్ ఆధ్వర్యంలో మండలంలో బిజెపి వివిధ మోర్చాలకు అధ్యక్షులను నియమించి,నియామక పత్రాలను అందజేశారు. వారిలో మహిళా మోర్చా: మన్నె సుమలత (యూసుఫ్ పేట) ఓబిసి మోర్చా వడ్ల బాగేష్ (మిన్పూర్)యువ మోర్చా: కేరూరి జగదీష్ (అబ్లాపూర్) కిసాన్ మోర్చా: జిన్నా గోపాల్ (నార్సింగి) ఎస్సీ మోర్చా: బాబు (గాజుల గూడెం)ఎస్టీ మోర్చా: పాతలోత్ వెంకట్ నాయక్ (పొడ్చన్ పల్లి తండా)అధ్యక్షులుగా మండల కోర్ కమిటీ నిర్ణయించి ప్రకటింతించినట్లు వెల్లడించారు.బీజేపీ నాయకులు మాట్లాడుతూ ప్రజలందరూ స్వతంత్ర దినోత్సవం సందర్భంగా మన దేశ ఐక్యతను చాటి చెప్పే విధంగా ప్రతి ఒక్కరూ తమ తమ ఇండ్లపై జాతీయ పతాకాన్ని ఎగురవేసి దేశభక్తిని చాటి చెప్పాల్సిందిగా నరేంద్ర మోడీ పిలుపును ఆచరిద్దామని పిలుపునిచ్చారు. ఆగస్టు 12వ తేదీ బుధవారం రోజు పాపన్నపేట మండల కేంద్రంలో నిర్వహించబోయే తిరంగా ర్యాలీకి పార్టీలకు, కుల, మతాలకతీతంగా ప్రతి ఒక్కరు విచ్చేసి విజయవంతం చేయాల్సిందిగా పేర్కొన్నారు. నూతనంగా మోర్చా అధ్యక్ష బాధ్యతలను స్వీకరించిన నాయకులందరూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని వారి ఆధ్వర్యంలో వివిధ మోర్చాలు బలోపేతం అవుతాయని ఆయన ఆశా భావాన్ని వ్యక్తపరిచారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షులు మల్లేశం, మైనార్టీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ గౌస్,మండల ప్రధాన కార్యదర్శి గొల్ల నాగభూషణం, ఉపాధ్యక్షులు బొక్కల భాగేష్, సీతానగర్ మల్లేష్, కార్యదర్శులు అన్నారం రాజు, వడ్ల చంద్రశేఖర్, శేఖర్, సాయిబాబా, సత్యం, చంద్రయ్య, రాజేందర్, సంతోష్, మురళి, చక్రపాణి, శంకరయ్య, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకం ఎగరాలి



- హర్ ఘర్ తిరంగా విజయవంతానికి బీజేపీ నాయకుల సన్నాహక సమావేశం

నసురుల్లాబాద్, /ఆగస్టు 10/ జన సంఘర్షణ)

నసురుల్లాబాద్ మండలంలోని మైలారం గ్రామంలో శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయం వద్ద "హర్ ఘర్ తిరంగా" కార్యక్రమ నిర్వహణపై బీజేపీ నాయకులు ముఖ్య సమావేశం నిర్వహించారు. దేశభక్తి, జాతీయ ఐక్యత భావనను ప్రజల్లో మరింతగా పెంపొందించాలనే లక్ష్యంతో కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని సమావేశంలో నిర్ణయించారు. మండల ప్రజల సహకారంతో కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు చేపట్టాల్సిన ఏర్పాట్లు, కార్యక్రమ నిర్వహణ విధానం, ప్రజలను భాగస్వాములను చేసే అంశాలపై నాయకులు చర్చించారు. ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసేలా ప్రజలను ప్రోత్సహించాలని, యువత, మహిళలు, విద్యార్థులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనేలా విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. జాతీయ జెండా పట్ల గౌరవం, దేశభక్తి భావన ప్రతి ఒక్కరిలో పెంపొందేలా హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని నాయకులు పిలుపునిచ్చారు. గ్రామస్థులు, యువత స్వచ్ఛందంగా ముందుకు వచ్చి కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కోరారు.

**నాయకులు, కార్యకర్తల హాజరు**

ఈ సమావేశంలో బీజేపీ మండల అధ్యక్షుడు చందూరి హన్మండ్లు, మండల ఇన్‌చార్జి మోహన్ రెడ్డి, రాష్ట్ర నాయకులు పైడిమల్ లక్ష్మీనారాయణ, ఓబీసీ జిల్లా కార్యవర్గ సభ్యుడు సతీష్, మండల ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, మండల ఉపాధ్యక్షుడు శేఖర్, ఓబీసీ మండల అధ్యక్షుడు భాస్కల సాయిలు, దళిత మోర్చా మండల అధ్యక్షుడు గంగాధర్, యువ మోర్చా మండల అధ్యక్షుడు భీమరి భాస్కర్, గిరిజన మోర్చా మండల అధ్యక్షుడు చౌవాన్ రాందాస్, మామిళ్ల గంగారెడ్డి, బూత్ అధ్యక్షులు సుబ్రహ్మణ్యస్వామి, కంది మల్లేష్, బతిని రాజు, సంతోష్, సాయి కుమార్, శివ కుమార్ తదితర ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మృతురాలు కుటుంబ సభ్యులను పరామర్శించిన మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మ దేవేందర్ రెడ్డి

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 10 (జన సంఘర్షణ)



మెదక్ జిల్లా రామాయంపేట మండలం కాట్రియాల గ్రామనికి చెందిన బిఆర్ఎస్ పార్టీ కార్యకర్త కొత్త సుధాకర్ రెడ్డి గారి తల్లి కొత్త శ్యామల ఆదివారం (మొన్న) స్వర్గస్తులైనారు. ఈ విషయం కాట్రియల్ కార్యకర్తల ద్వారా తెలుసుకున్న మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్ రెడ్డి ఈ రోజు వారి ఇంటికి వచ్చి కుటుంబ సభ్యులను పరామర్శించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాట్రియాల గ్రామ బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## కోడి పందేలపై పోలీసుల దాడి.. 12 మంది అరెస్ట్

- రూ.45,050 నగదు, 65 కోడి కత్తులు, 9 బైక్‌లు, 3 కార్లు, 11 ఫోన్లు స్వాధీనం

కామారెడ్డి, /ఆగస్టు 10:/(జనసంఘర్షణ )



సదాశివనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని తిర్మాన్పల్లి శివారులో నిర్వహిస్తున్న కోడి పందేలపై పోలీసులు దాడి చేసి 12 మందిని అదుపులోకి తీసుకున్నారు. తిర్మాన్పల్లి శివారులోని ఓ ఇటుక బట్టీ ప్రాంగణంలో కోడి పందేలు నిర్వహిస్తున్నట్లు అందిన విశ్వసనీయ సమాచారంతో సదాశివనగర్ పోలీసులు అక్కడికి చేరుకుని దాడి చేపట్టారు. ఈ సందర్భంగా పందేలు నిర్వహిస్తున్న 12 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 9 ద్విచక్ర వాహనాలు, 3 కార్లు, 11 సెల్‌ఫోన్లు, రూ.45,050 నగదు, 65 కోడి కత్తులను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల రాకను గమనించిన మరికొందరు అక్కడి నుంచి పరారైనట్లు పోలీసులు తెలిపారు. పరారైన వారి కోసం కూడా గాలింపు కొనసాగుతున్నట్లు చెప్పారు.

**కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు**

కోడి పందేలు, జూదం వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని పోలీసులు ఘాటుగా హెచ్చరించారు. పందేల నిర్వహణకు స్థలాలు సమకూర్చడం, పాల్గొనడం, బెట్టింగ్‌లకు పాల్పడటం వంటి చర్యలకు పాల్పడే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కోడి పందేల పేరుతో చట్టాన్ని ఉల్లంఘించే వారిపై నిఘా మరింత పెంచుతామని, ప్రజలు ఇలాంటి అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని పోలీసులు సూచించారు.

## కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా జైల్‌భరో

- సిపిఏం మండల కార్యదర్శి మచ్చా రామారావు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, చర్ల మండలం, ఆగష్టు 10(జనసంఘర్షణ):








చర్లలో కేంద్ర ప్రభుత్వ ప్రజా, రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ క్విట్ ఇండియా స్ఫూర్తితో, చర్ల అంబేద్కర్ సెంటర్‌లో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జైల్‌భరో కార్యక్రమం నిర్వహించారు. ముందుగా అంబేద్కర్ సెంటర్‌లో ధర్నా నిర్వహించి కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఆన్‌లైన్ ఎరువుల విధానాన్ని రద్దు చేసి రైతులకు పాత పద్ధతిలో ఎరువులు అందించాలని, వి బి జి రామ్ జి విధానాన్ని రద్దు చేసి పాత పద్ధతిలో 100 రోజుల ఉపాధి హామీ పనిని కొనసాగించాలని నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ అధ్యక్షురాలు పాయం రాధాకుమారి, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి బందెల చంటి, రైతు సంఘం ఉపాధ్యక్షుడు మచ్చా రామారావు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం రైతులు, వ్యవసాయ కూలీలు, కార్మికుల ప్రయోజనాలను దెబ్బతీసే విధానాలను అవలంబిస్తోందని విమర్శించారు. రైతులకు ఎరువులు సకాలంలో అందించాలని, ఉపాధి హామీ పథకానికి నిధులు పెంచి 100 రోజుల పని కల్పించాలని డిమాండ్ చేశారు. భద్రాచలం నుండి వెంకటాపురం రహదారి నిర్మంచాలి. డీజీల్ పెట్రోల్ నిత్యావసర ధరలు తగ్గించాలి అని ఆటో కార్మికులు కీ సంత్సరానికి 12000 ఇవ్వాలి అని తాలిపేరు ఎడమ. కుడి కాలువ కీ మరమ్మత్తులు చేసి రైతులకు అందరికి సకాలంలో నీళ్లు అందే విదంగా చూడాలి అని డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం జైల్‌భరో కార్యక్రమం చేపట్టగా పోలీసులు అక్కడికి చేరుకున్నారు. కార్యక్రమంలో సీఐటీయూ కార్యదర్శి విజయశీల, రైతు సంఘం నాయకులు నల్లగట్ల మూర్తి, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు నాగవర్మ, సీఐటీయూ ఆటో యూనియన్ అధ్యక్షుడు పామర్రు బాలాజీ, ఉపాధ్యక్షుడు బాలరాజుల సత్తిరాజు, ఐద్వా మండల కార్యదర్శి పొదుపుగంటి సమ్మక్క, గిరిజన సంఘం మండల కార్యదర్శి వరదల వరలక్ష్మి, వ్యవసాయ మహిళా విభాగం అధ్యక్షురాలు ఉడుగుల షారోన్, రైతు సంఘం నాయకుడు నవీన్, యూత్ ప్రెసిడెంట్ కంచర్ల సతీష్, కోశాధికారి కుక్కడపు రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

# హామీ ఇచ్చారు.. మాట నిలబెట్టుకున్నారు!

- బీర్కూర్ స్మశాన వాటికకు విద్యుత్ సౌకర్యం.
- వారం రోజుల్లోనే సమస్యకు పరిష్కారం

బీర్కూర్, /ఆగస్టు 10:/జన సంఘర్షణ)



దశాబ్దాలుగా విద్యుత్ సౌకర్యం లేక చీకట్లోనే దహన సంస్కారాలు నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొన్న బీర్కూర్ స్మశాన వాటికకు ఎట్టకేలకు విద్యుత్ వెలుగులు వచ్చాయి. ప్రజల ఇబ్బందులను గుర్తించిన యువజన నాయకుడు శశికాంత్, సీనియర్ నాయకుడు మేకల విట్టల్ సమస్య పరిష్కారానికి చొరవ చూపి ఇచ్చిన హామీని వారం రోజుల్లోనే నెరవేర్చారు. స్మశాన వాటికలో విద్యుత్‌తో పాటు నీటి సౌకర్యం లేకపోవడంతో దహన సంస్కారాల సమయంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని నాయకులు ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. సమస్యను తెలుసుకున్న ఎమ్మెల్యే వెంటనే స్పందించి స్మశాన వాటిక వరకు విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి విద్యుత్ సౌకర్యం కల్పించాలని ట్రాన్స్‌కో అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే ఆదేశాలతో ట్రాన్స్‌కో అధికారులు తక్షణమే చర్యలు చేపట్టి స్మశాన వాటికకు విద్యుత్ సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకువచ్చారు. ప్రజలకు ఇచ్చిన మాటను కేవలం హామీగా కాకుండా ఆచరణలో చూపించడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. "ప్రజల సమస్యను గుర్తించి..... అధికారుల దృష్టికి తీసుకెళ్లి.. హామీ ఇచ్చిన వారం రోజుల్లోనే పరిష్కారం చూపించడం అభినందనీయం" అంటూ గ్రామస్తులు పేర్కొన్నారు. స్మశాన వాటికకు విద్యుత్ సౌకర్యం కల్పించిన ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డికి, సమస్య పరిష్కారానికి కృషి చేసిన యువజన నాయకుడు శశికాంత్, సీనియర్ నాయకుడు మేకల విట్టల్, పట్టణ అధ్యక్షుడు కోరిమే రఘు, దుంపల రాజు, వార్డు మెంబర్ ఆనంద్‌తో పాటు ట్రాన్స్‌కో అధికారులకు గ్రామస్తులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

**హామీ.. హామీగానే కాదు.. ఆచరణలో!**

ప్రజల అవసరాన్ని గుర్తించి చొరవ తీసుకుంటే సమస్యలకు పరిష్కారం సాధ్యమనే దానికి బీర్కూర్ స్మశాన వాటికకు విద్యుత్ సౌకర్యం కల్పించిన ఘటన ఒక మంచి ఉదాహరణగా నిలిచింది.

## పరదా చాటున 1/70 చట్టం దుర్వినియోగం

- యల్ టీ ఆర్ చట్టం అమలుచేయని అధికారులు.
- ఎజన్సీ చట్టాలు అమలు చేసే బాధ్యత ఎవరిది.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, చర్ల మండలం, ఆగష్టు 10(జనసంఘర్షణ):



చర్ల మండలంలో బస్టాండ్ నుంచి ఏం పి డి ఓ ఆఫీస్, కాలేజీ రోడ్ కు వెళ్లే దారిలో బహుళ అంతస్తుల భవనం నిర్మిస్తున్న భవనానికి, గ్రామ పంచాయతి అధికాలు, మండల పరిషత్ అధికారులు, రెవిన్యూ అధికారులు, ఎవరు పర్మిషన్ ఇచ్చారు అని మండల ప్రజలు చర్చించు కుంటున్నారు. ఎజన్సీ చట్టాలు దుర్వినియోగం అవుతున్నప్పటికి, అధికారులు బాధ్యత మరిచి ఉండటం వెనుక, ఎ స్వార్ధ ప్రయోజనాలు ఉన్నాయి, ఈ చట్టాల బాధ్యత రాహిత్యం పైన జిల్లా స్థాయి అధికారులు విచారణ చేసి, చట్టాలు అమలు చేయవలసిన బాద్యులపై చర్యలు తీసుకోవాలి అని మండల ప్రజానీకం కోరుతున్నారు. చామాచార చట్టం ప్రకారం వివరాలు సెకరించి, ఉన్నత అధికారులకు, 1/70 చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలని, ఎల్ టీ ఆర్ నమోదు చేయాలని జిల్లా స్థాయి అధికారులకు తెలియజేస్తామని, పత్రిక కు సమాచారం అందించారు.

## వంకాయల సుగుణకు మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్ రెడ్డి నివాళి

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 10 (జన సంఘర్షణ)



మెదక్ మండలం రాయన్‌పల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త వెంకట్ తల్లి వంకాయల సుగుణ ఆదివారం మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్ రెడ్డి సోమవారం రాయన్ పల్లి గ్రామానికి చేరుకుని సుగుణ పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మృతురాలి కుమారుడు వెంకట్, భర్త లక్ష్మీనారాయణను పరామర్శించి మనోధైర్యం కల్పించారు. అనారోగ్యంతో సుగుణ మృతి చెందడం చాలా బాధాకరమని పద్మా దేవేందర్ రెడ్డి అన్నారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా రూ.5 వేల ఆర్థిక సహాయం అందజేశారు. వీరి వెంట జిల్లా పరిషత్ మాజీ ఉపాధ్యక్షురాలు లావణ్యరెడ్డి,మెదక్ మండల పార్టీ అధ్యక్షుడు అంజగౌడ్, రామాయంపేట మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు ఝూన్సీ లింగాపూర్ సర్పంచ్ మానెగలరామకృష్ణయ్య,మాజీ సర్పంచ్ నాగులు, నాయకులు బద్రి, బాలయ్య, నర్సగౌడ్, నర్సింలు, గ్రామస్థులు, బీఆర్ఎస్ కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

## "మందర్నా మంజీర నుంచి యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా?

- "అధికారుల నిఘాపై ప్రజల ప్రశ్నలు.. తక్షణ దర్యాప్తు చేపట్టాలని డిమాండ్

సాలూరు,/ ఆగస్టు 10: /జన సంఘర్షణ)





సాలూరు మండలం మందర్నా పరిధిలోని మంజీర నది నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్నారనే ఆరోపణలు స్థానికంగా కలకలం రేపుతున్నాయి. నిత్యం ఇసుక తరలింపు జరుగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇసుక తరలింపు జరిగే మార్గాల్లోనే పోలీసులు, రెవెన్యూ సిబ్బంది రాకపోకలు సాగిస్తున్నప్పటికీ అక్రమ రవాణాను ఎందుకు అడ్డుకోవడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇసుక తరలింపునకు అనుమతులు ఉన్నాయా? లేక నిబంధనలకు విరుద్ధంగా రవాణా జరుగుతోందా? అనే అంశాలపై అధికారులు స్పష్టత ఇవ్వాలని కోరుతున్నారు.

**మంజీర నుంచి ఇసుక తరలింపు వెనుక ఎవరెవరి ప్రమేయం ఉంది?..**

అధికారుల పర్యవేక్షణలో లోపం ఎందుకు ఏర్పడింది? అనే అంశాలపై సమగ్ర విచారణ జరపాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి, ఇసుక రవాణాకు సంబంధించిన అనుమతులు, వాహనాల వివరాలను పరిశీలించాలని కోరుతున్నారు. జిల్లా కలెక్టర్, జిల్లా పోలీస్ కమిషనర్ ప్రత్యేకంగా స్పందించి మందర్నా మంజీరలో ఇసుక అక్రమ రవాణాపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. ఆరోపణలు నిజమని తేలితే అక్రమ రవాణాకు పాల్పడిన వారితో పాటు, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినట్లు తేలిన సిబ్బందిపైనా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. ఇసుక అక్రమ రవాణాపై అధికారులు ఇకనైనా కఠినంగా వ్యవహరిస్తారా? లేక యథావిధిగా కొనసాగుతుందా? అనేది వేచి చూడాలి.

## పోతంగల్‌లో ఎంఆర్‌పీఎస్‌కు కొత్త కమిటీ.. ఏకగ్రీవ ఎన్నిక

- అధ్యక్షుడిగా నేర్రోళ్ల అశోక్ మాదిగ..
- ఉపాధ్యక్షులుగా సాయి రాం, శంకర్ మాదిగ

పోతంగల్, /ఆగస్టు 10/జన సంఘర్షణ):



పోతంగల్ గ్రామంలో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నూతన గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పద్మశ్రీ మందకృష్ణ మాదిగ సూచనలు, ఆశయాలకు అనుగుణంగా సంఘాన్ని గ్రామస్థాయిలో మరింత బలోపేతం చేయడంతో పాటు సామాజిక సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని నూతన కమిటీ సభ్యులకు నాయకులు సూచించారు. నూతన కమిటీ అధ్యక్షుడిగా నేర్రోళ్ల అశోక్ మాదిగ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా నేర్రోళ్ల సాయి రాం మాదిగ, బక్కోల్ల శంకర్ మాదిగలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులకు నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు. గ్రామంలో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి కార్యక్రమాలను విస్తృతం చేస్తూ, సామాజిక సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని ఆకాంక్షించారు.

**ఐక్యతతో ముందుకు.. హక్కుల సాధనే లక్ష్యం....**

నూతన కమిటీ బాధ్యతలు చేపట్టినలినేపథ్యంలో గ్రామంలో సంఘాన్ని మరింత చురుకుగా ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. కమిటీ ఏకగ్రీవ ఎన్నికతో పోతంగల్ గ్రామంలోని సంఘం నాయకులు, కార్యకర్తల్లో నూతన ఉత్సాహం నెలకొంది. నూతన కమిటీ సభ్యులకు పలువురి అభినందనలు తెలిపారు.

# పోరాటానికి ఓ ఉదాహరణ.. ధైర్యానికి ఓ చిహ్నం..

- న్యాయ స్వరం ఫూలన్ దేవి
- చంబల్ నుంచి పార్లమెంట్ వరకు సాగిన బహుజన వీరవనిత ప్రస్థానం..
- జయంతి సందర్భంగా ఘన నివాళి

ఢిల్లీ/ఆగస్టు 10/జన సంరక్షణ):



భారత సామాజిక చరిత్రలో కొన్ని జీవితాలు కేవలం వ్యక్తిగత కథలుగా మిగిలిపోవు. అవి పేదరికం, కుల వివక్ష, లింగ అసమానత, సామాజిక అణచివేత, న్యాయం కోసం సాగిన పోరాటాలకు ప్రతీకలుగా నిలుస్తాయి. అలాంటి సంక్లిష్టమైన, చారిత్రాత్మక జీవితాల్లో ఫూలన్ దేవి ప్రస్థానం ఒకటి. 1963 ఆగస్టు 10న ఉత్తరప్రదేశ్‌లోని జలౌన్ జిల్లా ఘురా కా పూర్వా గ్రామంలో సాధారణ పడవ నడిపే కుటుంబంలో జన్మించిన ఫూలన్ దేవి చిన్ననాటి నుంచే పేదరికం, సామాజిక వివక్ష, లింగ అసమానత వంటి అనేక ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొన్నారు. బాల్య వివాహం, అనంతర వేధింపులు ఆమె జీవితాన్ని తీవ్రంగా ప్రభావితం చేశాయి.

**అణచివేత నుంచి తిరుగుబాటు దిశగా..**

గ్రామీణ సమాజంలో అణగారిన వర్గాల మహిళలు ఎదుర్కొంటున్న అన్యాయానికి ఫూలన్ దేవి జీవితం ఒక ప్రతిబింబంగా నిలిచింది. వరుసగా ఎదురైన అవమానాలు, వేధింపులు, ప్రతికూల పరిస్థితుల నేపథ్యంలో ఆమె చంబల్ ప్రాంతంలో తిరుగుబాటు జీవితాన్ని స్వీకరించారు. అయితే ఆమె తిరుగుబాటు జీవితం తీవ్ర వివాదాలతో కూడుకున్నది. ఆమెపై పలు తీవ్రమైన నేరారోపణలు నమోదయ్యాయి. అందువల్ల ఫూలన్ దేవి జీవితాన్ని కేవలం వీరగాథగా చూడటం కాకుండా, ఆ కాలం నాటి సామాజిక పరిస్థితులు, ఆమె ఎదుర్కొన్న అణచివేత, ఆమెపై వచ్చిన ఆరోపణలు అన్నింటినీ సమగ్ర చారిత్రక నేపథ్యంలో చూడాల్సిన అవసరం ఉంది.

**లొంగుబాటు.. జీవితంలో కీలక మలుపు**

1983లో ఫూలన్ దేవి ఉత్తరప్రదేశ్ ప్రభుత్వానికి లొంగిపోయారు. అనంతరం సుదీర్ఘకాలం జైలు జీవితం గడిపారు. సుమారు 11 సంవత్సరాల తర్వాత 1994లో విడుదలయ్యారు.

జైలు నుంచి బయటకు వచ్చిన తర్వాత ఆమె జీవితం ఊహించని మలుపు తిరిగింది. ఒకప్పుడు చంబల్ తిరుగుబాటుదారురాలిగా వార్తల్లో నిలిచిన ఫూలన్ దేవి, ఆ తర్వాత ప్రజాస్వామ్య రాజకీయాల్లోకి అడుగుపెట్టి పార్లమెంట్‌కు చేరుకున్నారు.

**చంబల్ నుంచి పార్లమెంట్ వరకు..**

1996లో ఉత్తరప్రదేశ్‌లోని భదోహి లోక్‌సభ నియోజకవర్గం నుంచి ఎంపీగా ఎన్నికై దేశ రాజకీయాల్లో తనదైన ముద్ర వేశారు. పేద, వెనుకబడిన కుటుంబం నుంచి వచ్చిన ఓ మహిళ దేశ అత్యున్నత ప్రజాస్వామ్య వేదికైన పార్లమెంట్‌లో అడుగుపెట్టడం అప్పట్లో విస్తృత చర్చకు దారితీసింది. ఫూలన్ దేవి రాజకీయ ప్రస్థానం సామాజికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన ప్రజలకు రాజకీయ ప్రాతినిధ్యం ఎంత ముఖ్యమో చాటిచెప్పిన ఘట్టంగా నిలిచింది.

**అణగారిన మహిళలకు ఓ ప్రతీక**

కాలక్రమేణా ఫూలన్ దేవి గుర్తింపు కేవలం మాజీ తిరుగుబాటుదారురాలిగా కాకుండా, అణగారిన వర్గాల మహిళల హక్కులు, గౌరవం, సమానత్వం కోసం జరిగిన పోరాటానికి ప్రతీకగా మారింది. అయితే ఆమె వారసత్వంపై సమాజంలో భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. కొందరు ఆమెను చట్టాన్ని ఉల్లంఘించిన తిరుగుబాటుదారురాలిగా చూస్తే, మరికొందరు ఆమె జీవితాన్ని సామాజిక అణచివేతకు వ్యతిరేకంగా జరిగిన పోరాటానికి ప్రతీకగా భావిస్తారు. ఈ రెండు కోణాలను పరిగణనలోకి తీసుకున్నప్పుడే ఫూలన్ దేవి జీవితాన్ని సమగ్రంగా అర్థం చేసుకోవచ్చు.

**అకాల నిష్క్రమణ.. చెరగని జ్ఞాపకం**

2001 జూలై 25న న్యూఢిల్లీలోని తన అధికారిక నివాసం వెలుపల ఫూలన్ దేవి కాల్చి చంపబడ్డారు. ఆమె జీవితం అకస్మాత్తుగా ముగిసినా, ఆమె ప్రస్థానం లేవనెత్తిన సామాజిక, రాజకీయ ప్రశ్నలు మాత్రం నేటికీ చర్చనీయాంశంగానే ఉన్నాయి. పేదరికం నుంచి తిరుగుబాటు వరకు.. జైలు నుంచి పార్లమెంట్ వరకు.. పోరాటం నుంచి రాజకీయ గుర్తింపు వరకు.. ఫూలన్ దేవి జీవితం అనేక వైరుధ్యాలతో కూడిన చారిత్రాత్మక ప్రస్థానం.

**సామాజిక న్యాయం కోసం గళం..**

ఫూలన్ దేవి జీవితం మనకు ఒక ముఖ్యమైన విషయాన్ని గుర్తుచేస్తుంది. సామాజిక న్యాయం అనేది కేవలం పుస్తకాల్లో ఉండే పదం కాదు. అసమానతలు, వివక్ష, పేదరికం, అణచివేతలను ఎదుర్కొంటున్న కోట్లాది మంది ప్రజల జీవితాలకు సంబంధించిన అంశం. మహిళలకు గౌరవం, సమానత్వం, అణగారిన వర్గాలకు హక్కులు, సమాజంలో ప్రతి ఒక్కరికీ న్యాయం అందేలా చేయాలనే లక్ష్యంతో గళం విప్పాల్సిన అవసరం ఉందని ఆమె ప్రస్థానం గుర్తుచేస్తోంది.

**బహుజన వీరవనిత ఫూలన్ దేవి జయంతి సందర్భంగా ఆమెకు వినయపూర్వక నివాళులు.**

ఆమె జీవితంలోని పోరాటాలను స్మరించుకుంటూ, సామాజిక న్యాయం, సమానత్వం, గౌరవం కోసం మన గళాన్ని మరింత బలంగా వినిపిద్దాం.

# సేవా స్ఫూర్తితో ప్రెస్ క్లబ్ కార్యదర్శి జన్మదిన వేడుకలు

- ఆర్భాటాలకు దూరంగా.. ఆత్మీయుల మధ్య ఘనంగా జన్మదిన సంబరాలు

పోతంగల్,/ ఆగస్టు 10:/(జన సంఘర్షణ)




పోతంగల్ మండలం ప్రెస్ క్లబ్ కార్యదర్శి జన్మదిన వేడుకలు ఆత్మీయ వాతావరణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ సభ్యులు, పాత్రికేయ మిత్రులు, సన్నిహితులు, శ్రేయోభిలాషులు పాల్గొని కార్యదర్శికి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. జన్మదిన వేడుకలను కేవలం సంబరాలకే పరిమితం చేయకుండా.. సమాజం పట్ల బాధ్యతను గుర్తుచేసుకునే విధంగా నిర్వహించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో పాత్రికేయుల పాత్ర కీలకమని, అదే సమయంలో ప్రజలకు అందుబాటులో ఉంటూ సామాజిక సేవలోనూ ముందుండాలని పలువురు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ సభ్యులు మాట్లాడుతూ.. ప్రజల గొంతుకగా నిలుస్తూ, సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లడంలో కార్యదర్శి చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. భవిష్యత్‌లో మరింత ఉత్సాహంతో ప్రజా ప్రయోజన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టాలని ఆకాంక్షించారు. జన్మదిన వేడుకల్లో భాగంగా పరస్పరం శుభాకాంక్షలు తెలియజేసుకుంటూ, ప్రెస్ క్లబ్ ఐక్యతను మరింత బలోపేతం చేసుకోవాలని సభ్యులు నిర్ణయించారు.

**ఆర్భాటం కంటే ఆత్మీయత.. సంబరాల కంటే సేవ..**

జన్మదినం కంటే ప్రజా ప్రయోజనమే లక్ష్యం అనే సందేశంతో సాగిన ఈ వేడుకలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ సభ్యులు, పాత్రికేయులు, అధ్యక్షుడు, అర్జున్, ఉపాధ్యక్షుడు, గంధపు దత్తు, క్యాషియర్, లక్ష్మణ్, రాజేష్, పాకల గజేందర్, అజారుద్దీన్, శ్రీకాంత్, వడ్ల సురేష్, యాదురావు, విజయ్, భీమ్రావు, మిత్రులు, శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.

# పోతంగల్ బస్టాండ్‌లో నీటి నిల్వలు.. ప్రయాణికులకు నరకయాతన

- గుంతలమయంగా మారిన ప్రాంగణం..
- వర్షం పడితే అడుగు పెట్టాలంటేనే భయం

పోతంగల్,/ ఆగస్టు 10:/(జన సంఘర్షణ)

పోతంగల్ మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంగణం అధ్వానంగా మారడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షం పడిన ప్రతిసారి బస్టాండ్ ఆవరణలోని గుంతల్లో పెద్ద ఎత్తున నీరు నిలిచిపోవడంతో ప్రయాణికులకు నడవడమే కష్టంగా మారింది. ఎక్కడ గుంత ఉందో.. ఎక్కడ నేల ఉందో తెలియని పరిస్థితి నెలకొనడంతో బస్సుల కోసం వచ్చే ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు.




**"బస్టాండ్‌లో సరైన డ్రైనేజీ వ్యవస్థ....**


" లేకపోవడంతో వర్షపు నీరు బయటకు వెళ్లే మార్గం లేక రోజుల తరబడి నిలిచిపోతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. దీంతో బస్టాండ్ ప్రాంగణం చిన్నపాటి చెరువును తలపిస్తోంది. నీటిలోంచి వెళ్లే క్రమంలో ప్రయాణికులు జారిపడే ప్రమాదం కూడా ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా వృద్ధులు, మహిళలు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొంటున్నారు. మరోవైపు నీరు నిలిచిపోవడంతో దోమల వృద్ధి పెరిగి పరిసరాల్లో పారిశుద్ధ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. బస్సులు బస్టాండ్‌లోకి వచ్చి వెళ్లే సమయంలో నీరు, బురద ప్రయాణికులపై పడుతుండటంతో మరింత ఇబ్బందికర పరిస్థితి ఏర్పడుతోందని ప్రయాణికులు వాపోతున్నారు.

ప్రజల నిత్య రాకపోకలకు కీలకంగా ఉన్న బస్టాండ్ ప్రాంగణం ఇంత దారుణంగా మారినా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం పట్ల స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి వర్షాకాలంలో ఇదే సమస్య పునరావృతమవుతున్నా శాశ్వత పరిష్కారం చూపకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి... బస్టాండ్‌లోని గుంతలను పూడ్చడంతో పాటు వర్షపు నీరు నిల్వ ఉండకుండా తగిన డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలని ప్రయాణికులు, స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. తాత్కాలికంగా నీటిని తొలగించడమే కాకుండా శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు చేపట్టాలని, ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకుని వెంటనే మరమ్మతు పనులు ప్రారంభించాలని కోరుతున్నారు.

# పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరువలో నిజాంసాగర్..

- రైతుల్లో ఆనందం
- 17.802 టీఎంసీలకు గాను 11.891 టీఎంసీలకు చేరిన నీటి నిల్వ.. 1.25 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీటిపై భరోసా

కామారెడ్డి బ్యూరో:/ఆగస్టు 10/జన సంఘర్షణ)



ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు వరప్రదాయినిగా నిలిచిన నిజాంసాగర్ ప్రాజెక్టు జలకళను సంతరించుకుంటోంది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో ప్రాజెక్టులోకి వరద నీరు వచ్చి చేరుతుండటంతో నీటిమట్టం రోజురోజుకూ పెరుగుతోంది. దీంతో నిజాంసాగర్‌ను నమ్ముకుని సాగు చేస్తున్న రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. సోమవారం నాటికి నిజాంసాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1405 అడుగులు కాగా, ప్రస్తుత నీటిమట్టం 1400.50 అడుగులకు చేరింది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నిల్వ సామర్థ్యం 17.802 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 11.891 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దీంతో ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరువ కావడంతో రైతుల్లో సాగుపై ఆశలు చిగురిస్తున్నాయి.

**వరి సాగుపై రైతుల నమ్మకం...**

నిజాంసాగర్ ప్రాజెక్టు ఆయకట్టు పరిధిలో సుమారు 1.25 లక్షల ఎకరాల్లో రైతులు పంటలు సాగు చేస్తున్నారు. ఇందులో దాదాపు 75 శాతం విస్తీర్ణంలో వరి, మిగతా 25 శాతం విస్తీర్ణంలో మెట్ట పంటలు సాగవుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం వరి సాగుకు బదులుగా మెట్ట పంటల వైపు రైతులను ప్రోత్సహించినప్పటికీ, నీటి లభ్యతపై నమ్మకంతో అన్నదాతలు అధికంగా వరి సాగుకే మొగ్గు చూపారు. ప్రస్తుతం ప్రాజెక్టులోకి నీరు సమృద్ధిగా చేరుతుండటంతో సాగునీటికి ఢోకా ఉండదనే ధీమా రైతుల్లో కనిపిస్తోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరితే రబీ పంటలకూ నీటి లభ్యత మెరుగుపడే అవకాశం ఉందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

**జలకళతో ఉమ్మడి జిల్లా.....**

నిజాంసాగర్‌తో పాటు ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని శ్రీరాంసాగర్, పోచారం, కౌలాస్ ప్రాజెక్టులు సైతం నీటితో కళకళలాడుతున్నాయి. వరుస వర్షాలతో ప్రాజెక్టుల్లోకి నీరు చేరుతుండటంతో రైతాంగంలో కొత్త ఉత్సాహం నెలకొంది. సాగునీటి భరోసా పెరగడం వ్యవసాయానికి శుభసూచకమని అన్నదాతలు పేర్కొంటున్నారు.

# కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక రైతు, ప్రజా వ్యతిరేక విధానాలు ఎండగడుతూ రాస్తారోకో

- క్విట్ ఇండియా ఉద్యమస్ఫూర్తి తో జైలు బరో జయప్రదం.
- నాలుగు లేబర్ కోళ్లు రద్దు చేయాలి.
- స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందాలు రద్దు చేయాలి.

మంచిర్యాల జిల్లా, చెన్నూరు మండలం, ఆగష్టు 10(జనసంఘర్షణ):



చెన్నూరు మండల కేంద్రంలో సిఐటియు, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జైల్ బరో కార్యక్రమం నిర్వహణలో భాగంగా రావి చెట్టు నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించడం జరిగింది. అనంతరం బస్టాండ్ దగ్గర రాస్తారోకో చేయడం జరిగింది. ఈ సందర్భంగా బోడంకి చందు రైతు సంఘం జిల్లా కార్యదర్శి హాజరై మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న ప్రజా, కార్మిక,రైతు వ్యతిరేక విధానాలు నశించాలని, స్వాతంత్ర ఉద్యమం కన్నా ముందు సాధించుకున్నా కార్మిక చట్టాలను రద్దుచేసి, నాలుగు లేబర్ కోడ్ తీసుకువచ్చి కార్మికులకు కనీస హక్కులు లేకుండా చేస్తున్నారు. ప్రభుత్వ సంస్థలన్నీ ప్రైవేటుపరం చేస్తున్నారు, రైతుల విత్తన చట్టం, విద్యుత్ సవరణ చట్టాశీ రద్దు చేయాలని , మహాత్మ గ్రామీణ ఉపాధి హామీ చట్టం కొనసాగించాలి, వ్యవసాయ అందారిత పంటలకు మద్దతు ధర కల్పించాలి, స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందాలు రద్దు చేయాలి, వ్యవసాయాన్ని రంగాన్ని కార్పొరేట్లకు కట్టబెట్టే పని మానుకోవాలి. మధ్యాహ్నం భోజనం,ఆశ కార్మికులకు కనీస వేతనం జీవో అమలు చేయాలి . కార్మికులకు పెండింగ్ బిల్లులు వేతనాలు చెల్లించాలి. ఉపాధి హామీ కూలీలకు 200 రోజులు పని కల్పించి, రోజుకు 600 రూపాయలు ఇవ్వాలని , ఆదివాసులకు అటవీ హక్కు చట్టం పటిష్టంగా అమలు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎర్మ పున్నం, ఆదివాసి గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి కావేరి రవి, సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు శ్యామల ఉమారాణి, మహిళా సంఘం జిల్లా కార్యదర్శి కృష్ణమాచారి, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు సరోజ, ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కరింభీ, మధ్యాహ్నం భోజన కార్మిక సంఘం జిల్లా అధ్యక్షురాలు, ఎర్రోళ్ల సంజీవ్, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు, ప్రజాసంఘాల నాయకులు చంద్రన్న,సమ్మక్క, మల్లికార్జున్,మదనక్క, గట్టక్క, దుర్గక్క, విజయలక్ష్మి, సెగ్గం భూషయ్య, రమేష్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# చెత్తకుప్పలతో చీమలపాడు.. పారిశుధ్యం గాలికి!

- గ్రామపంచాయతీ పరిధిలో పేరుకుపోయిన చెత్తచెదారం..
- పట్టించుకోని అధికారుల తీరుపై గ్రామస్తుల ఆగ్రహం





సింగరేణి ప్రతినిధి: (జన సంఘర్షణ) న్యూస్

సింగరేణి మండలం చీమలపాడు గ్రామపంచాయతీలో పారిశుధ్య పరిస్థితులు రోజురోజుకూ అధ్వానంగా మారుతున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలోని పలు ప్రాంతాల్లో దట్టంగా చెత్తచెదారం పేరుకుపోయి పరిసరాలు అపరిశుభ్రంగా మారాయి. చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాల్సినప్పటికీ పట్టించుకోకపోవడంతో చెత్తకుప్పలు పేరుకుపోతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీంతో దుర్వాసన వెదజల్లడంతో పాటు దోమలు, ఈగలు పెరిగి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెబుతున్నారు. ప్రజారోగ్యానికి ముప్పుగా మారుతున్న పారిశుధ్య సమస్యపై అధికారులు వెంటనే దృష్టి సారించాలని గ్రామస్తులు కోరుతున్నారు. గ్రామపంచాయతీ సిబ్బంది క్రమం తప్పకుండా పారిశుధ్య పనులు చేపట్టి, పేరుకుపోయిన చెత్తను తొలగించి పరిశుభ్రమైన వాతావరణం కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చీమలపాడు గ్రామపంచాయతీలో పారిశుధ్య సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు.

# ఎస్ఐఆర్ ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం విజయవంతంగా పూర్తి



కామారెడ్డి ప్రతినిధి/ఆగస్టు 10/(జన సంఘర్షణ)

ఓటర్ల వివరాల ఖచ్చితత్వం, పారదర్శకతకు ప్రాధాన్యత – జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ భారత ఎన్నికల సంఘం, రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆధ్వర్యంలో చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం (ఎస్ఐఆర్) కామారెడ్డి జిల్లాలో విజయవంతంగా పూర్తయిందని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ తెలిపారు. జిల్లాలోని జుక్కల్, యెల్లారెడ్డి, కామారెడ్డి మూడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని 796 పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన 6,96,006 మంది ఓటర్లకు ఎన్నికల ఫారాల ముద్రణ, పంపిణీ 100 శాతం పూర్తయిందని కలెక్టర్ వెల్లడించారు. ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, సమగ్రంగా నమోదు చేయడం ద్వారా ఓటర్ల జాబితాను మరింత ఖచ్చితంగా, పారదర్శకంగా రూపొందించేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

**నియోజకవర్గాల వారీగా వివరాలు..**

జుక్కల్ అసెంబ్లీ నియోజకవర్గం: 2,06,343 మంది ఓటర్లకు ఎన్నికల ఫారాల పంపిణీ 100 శాతం పూర్తయింది. ఇప్పటివరకు 90.27 శాతం వివరాల డిజిటైజేషన్ పూర్తయింది.

యెల్లారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గం: 2,28,503 మంది ఓటర్లకు ఎన్నికల ఫారాల పంపిణీ 100 శాతం పూర్తయింది. 90.17 శాతం వివరాల డిజిటైజేషన్ పూర్తయింది.

కామారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గం: 2,61,160 మంది ఓటర్లకు ఎన్నికల ఫారాల పంపిణీ 100 శాతం పూర్తయింది. 83.96 శాతం వివరాల డిజిటైజేషన్ పూర్తయింది.

**జిల్లా స్థాయి గణాంకాలు...**

జిల్లా వ్యాప్తంగా మొత్తం 6,96,006 మంది ఓటర్లు ఉండగా, అందరికీ ఎన్నికల ఫారాల ముద్రణ, పంపిణీ 100 శాతం పూర్తయింది. ఇప్పటివరకు 6,11,568 ఎన్నికల ఫారాలు, అంటే 87.87 శాతం డిజిటైజేషన్ పూర్తయినట్లు కలెక్టర్ తెలిపారు. మొత్తం 796 మంది బూత్ స్థాయి అధికారులు ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమానికి సంబంధించిన శిక్షణను పూర్తిగా పొందారు. 84,438 ధృవీకరణ కాని ఎన్నికల ఫారాలు నమోదు చేసినట్లు తెలిపారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా మరణించిన ఓటర్లు, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు మారిన వారు, ఇప్పటికే మరోచోట నమోదు అయిన వారు, గైర్హాజరైన ఓటర్లు తదితర వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, సంబంధిత వర్గీకరణలను స్పష్టంగా నమోదు చేసినట్లు కలెక్టర్ పేర్కొన్నారు.

**ముసాయిదా ఓటర్ల జాబితాను పరిశీలించాలి**

ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ తెలిపారు. ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురణ అనంతరం ప్రతి ఓటరు మరోసారి తమ పేరు, చిరునామా, వయస్సు, ఇతర ఓటరు వివరాలను తప్పనిసరిగా పరిశీలించుకోవాలని సూచించారు. తమ వివరాల్లో ఏవైనా తప్పులు ఉన్నా, పేరు లేకపోయినా లేదా ఇతర అభ్యంతరాలు ఉన్నా, నిబంధనల ప్రకారం సంబంధిత ఎన్నికల అధికారులను సంప్రదించి సవరణలు, అభ్యంతరాలు నమోదు చేసుకోవాలని కలెక్టర్ కోరారు. అర్హులైన ప్రతి ఓటరి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా, అనర్హమైన లేదా తప్పుగా నమోదైన వివరాలను నిబంధనల ప్రకారం సరిచేసే ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తున్నామని తెలిపారు.

**ఓటర్లు తమ వివరాలను తప్పనిసరిగా పరిశీలించాలి**

ప్రతి ఓటరు తమ ఓటరు జాబితాలోని పేరు, చిరునామా, ఇతర వివరాలను పరిశీలించుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఓటర్ల నుంచి బూత్ స్థాయి అధికారులు సేకరించిన వివరాలను విధివిధానాల ప్రకారం డిజిటైజ్ చేస్తున్నామని తెలిపారు.ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేయడంలో కృషి చేసిన ఎన్నికల సిబ్బంది, బూత్ స్థాయి అధికారులు, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బందిని జిల్లా కలెక్టర్ అభినందించారు. ఓటర్ల జాబితా ఖచ్చితత్వం, పారదర్శకతను నిర్ధారించడంలో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆయన సూచించారు.

# వరుణ యాగం పూర్ణాహుతిలో సీఎం రేవంత్ రెడ్డి దంపతులు

- నాగార్జునసాగర్‌లో ప్రత్యేక పూజలు.. రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురవాలని ప్రార్థన




నాగార్జునసాగర్,/ ఆగస్టు 10:/(జన సంఘర్షణ)


తెలంగాణ రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి చెరువులు, ప్రాజెక్టులు జలకళను సంతరించుకోవడంతో పాటు పంట పొలాలు పచ్చగా కళకళలాడాలని ఆకాంక్షిస్తూ నాగార్జునసాగర్‌లో నిర్వహించిన వరుణ యాగం పూర్ణాహుతి కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి దంపతులు పాల్గొన్నారు. ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి దంపతుల ఆధ్వర్యంలో సోమవారం ఉదయం నాగార్జునసాగర్ వద్ద వరుణ యాగాన్ని ఘనంగా ప్రారంభించారు. వేద పండితుల మంత్రోచ్ఛారణల నడుమ యాగ కార్యక్రమాలు కొనసాగాయి. అనంతరం మధ్యాహ్నం 3 గంటల సమయంలో సీఎం రేవంత్ రెడ్డి దంపతులు యాగశాలకు చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి పూర్ణాహుతిలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం దంపతులు వేద పండితుల సూచనల మేరకు యాగ కార్యక్రమాల్లో పాల్గొని రాష్ట్ర ప్రజల సుభిక్షం కోసం ప్రార్థనలు చేశారు. ఈ వానాకాలంలో విస్తారంగా వర్షాలు కురిసి సాగునీటి వనరులు నిండాలని, రైతులకు అనుకూల పరిస్థితులు ఏర్పడి పాడి, పంటలతో అన్నదాతల కుటుంబాలు సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు.

**రైతు సంక్షేమమే లక్ష్యంగా..**

వర్షాభావ పరిస్థితులు తొలగి రాష్ట్రవ్యాప్తంగా సమృద్ధిగా వర్షాలు కురవాలని, సాగునీటి ప్రాజెక్టులు నిండుకుండలా మారాలని యాగంలో ప్రత్యేకంగా ప్రార్థనలు చేశారు. పంటలకు సమృద్ధిగా నీరు అందడంతో రైతులు మంచి దిగుబడులు సాధించి ఆర్థికంగా బలపడాలని సీఎం ఆకాంక్షించారు. పూర్ణాహుతి అనంతరం వేద పండితులు సీఎం రేవంత్ రెడ్డి దంపతులకు ఆశీర్వచనాలు అందించి తీర్థప్రసాదాలు అందజేశారు. వరుణ యాగం సందర్భంగా నాగార్జునసాగర్ ప్రాంతంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

# చిరిగిన నోట్లు ఉన్నాయా? మార్చుకునే హక్కు మీకుంది!

- బ్యాంకుల్లో ఉచితంగా మార్చుకోవచ్చు.. నిరాకరిస్తే ఆర్‌బీఐకి ఫిర్యాదు చేసే అవకాశం
- మన జన సంఘర్షణ ప్రత్యేక కథనం....




హైదరాబాద్/ఆగస్టు10/(జన సంఘర్షణ)

చిరిగిపోయిన, పాడైపోయిన లేదా మురికిగా మారిన కరెన్సీ నోట్లు చేతిలో ఉన్నాయా? ఇక వాటిని చూసి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. అలాంటి నోట్లను మార్చుకునే హక్కు పౌరులకు ఉందని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) నిబంధనలు స్పష్టం చేస్తున్నాయి. దేశంలోని ఏ వాణిజ్య బ్యాంకు శాఖలోనైనా చిరిగిన, మురికిగా మారిన కరెన్సీ నోట్లను నిబంధనల ప్రకారం ఉచితంగా మార్చుకునే అవకాశం ఉంది. ఇందుకోసం ప్రజలు తప్పనిసరిగా తమ ఖాతా ఉన్న బ్యాంకుకే వెళ్లాల్సిన అవసరం లేదు. అయితే కొన్ని సందర్భాల్లో బ్యాంకు సిబ్బంది నోట్లు మార్చేందుకు నిరాకరిస్తే, ముందుగా సంబంధిత బ్యాంకులో రాతపూర్వకంగా ఫిర్యాదు చేయాలి. సమస్య పరిష్కారం కాకపోతే ఆర్‌బీఐ ఫిర్యాదు వ్యవస్థను ఆశ్రయించే అవకాశం ఉంది. ఫిర్యాదు చేసిన తర్వాత కూడా పరిష్కారం లభించకపోతే ఆర్‌బీఐ సీఎంఎస్ పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు. అలాగే 14448 టోల్‌ఫ్రీ నంబర్ ద్వారా ఆర్‌బీఐ అంబుడ్స్‌మన్ వ్యవస్థకు సంబంధించిన సహాయం పొందవచ్చు.

**నోట్లు పాడైతే ఏం చేయాలి? :** చిరిగిన లేదా మురికిగా మారిన నోట్లను బ్యాంకు శాఖకు తీసుకెళ్లాలి. నోటు పరిస్థితిని బట్టి బ్యాంకు నిబంధనల ప్రకారం మార్పిడి చేస్తుంది. అనవసరంగా మధ్యవర్తులను ఆశ్రయించాల్సిన అవసరం లేదు. బ్యాంకు సేవ నిరాకరిస్తే రాతపూర్వక ఫిర్యాదు చేసి, అవసరమైతే =దీ×ని ఆశ్రయించవచ్చు. మీ చేతిలో పాడైన నోటు ఉంటే దాన్ని పారేయకండి. నిబంధనల ప్రకారం బ్యాంకులో మార్చుకునే అవకాశం ఉందనే విషయాన్ని గుర్తుంచుకోండి.

# ఎంత చెప్పినా పద్ధతి మార్చుకోరా.. ఇక చర్యలు తప్పవు!

- నలుగురు పోలీసు అధికారులకు డీజీపీ సీవీ ఆనంద్ ఘాటు హెచ్చరిక



హైదరాబాద్/, ఆగస్టు 10: జన సంఘర్షణ)

పోలీసు శాఖలో విధి నిర్వహణ, క్రమశిక్షణ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కొందరు అధికారులపై డీజీపీ సీవీ ఆనంద్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిపారు. ఎంతసార్లు సూచనలు చేసినా నలుగురు అధికారులు తమ పద్ధతిని మార్చుకోవడం లేదంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు పోలీసు శాఖలో చర్చనీయాంశంగా మారాయి.

సోమవారం మీడియాతో మాట్లాడుతూ..,

వీడియో కాన్ఫరెన్స్‌లు, టెలికాన్ఫరెన్స్‌ల ద్వారా పలుమార్లు స్పష్టమైన సూచనలు చేసినప్పటికీ సంబంధిత అధికారులు తమ తీరు మార్చుకోవడం లేదని డీజీపీ పేర్కొన్నారు. ఇకపై కూడా ఇదే వైఖరి కొనసాగితే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

**విధుల్లో నిర్లక్ష్యాన్ని సహించేది లేదు**

పోలీసు శాఖలో ప్రతి అధికారి బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాల్సిందేనని డీజీపీ స్పష్టం చేసినట్లు సమాచారం. ప్రజలకు మెరుగైన సేవలు అందించడం, శాఖ ప్రతిష్ఠను కాపాడటం ప్రతి పోలీసు అధికారి బాధ్యత అని పేర్కొన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలను పట్టించుకోకుండా వ్యవహరించే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవడానికి వెనుకాడబోమనే సంకేతాలను ఆయన ఇచ్చారు.

**మారకపోతే చర్యలు తప్పవు....**

"ఎంత చెప్పినా పద్ధతి మార్చుకోకపోతే ఉపేక్షించేది లేదు.. అవసరమైతే కఠిన చర్యలు తీసుకుంటాం" అన్న రీతిలో డీజీపీ చేసిన హెచ్చరికలు పోలీసు అధికారులకు స్పష్టమైన సంకేతంగా నిలిచాయి. ఇకనైనా సంబంధిత అధికారులు తమ పనితీరును మార్చుకుని శాఖా నిబంధనలకు అనుగుణంగా విధులు నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఉన్నతాధికారుల ఆదేశాలను బేఖాతరు చేస్తూ వ్యవహరించే అధికారులపై చర్యలు తీసుకోవడం ద్వారా పోలీసు శాఖలో క్రమశిక్షణకు పెద్దపీట వేయడంతో పాటు, ప్రజలకు జవాబుదారీతనంతో కూడిన పోలీసింగ్ అందించాలనే లక్ష్యాన్ని మరింత కఠినంగా అమలు చేయనున్నారనే చర్చ పోలీసు వర్గాల్లో సాగుతోంది.

# ఫతేపూర్ రోడ్ల దుస్థితి.. వర్షం వస్తే చాలు నరకమే!

- గుంతల్లో నిలిచే వర్షపు నీరు.. ప్రమాదాలకు ఆహ్వానం
- అధికారుల తీరుపై గ్రామస్థుల ఆగ్రహం



సాలూర, ఆ/గస్టు 10/జన సంఘర్షణ:

సాలూర మండలం ఫతేపూర్ గ్రామంలో రహదారుల పరిస్థితి అధ్వానంగా మారడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్లపై ఏర్పడిన భారీ గుంతలు, వాటిలో నిలిచిపోతున్న వర్షపు నీటితో రాకపోకలు కష్టతరంగా మారాయి. చిన్నపాటి వర్షం కురిసినా రహదారులు నీటితో నిండిపోవడంతో గుంతలు కనిపించక వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే పరిస్థితి నెలకొంది.

**వర్షం పడితే రోడ్లు చెరువులే..**


ఫతేపూర్ గ్రామంలోని పలు రహదారులు వర్షం కురిసిన ప్రతిసారీ చెరువులను తలపిస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ద్విచక్ర వాహనదారులు గుంతల్లో పడి జారిపడే ప్రమాదం ఉందని, వృద్ధులు, మహిళలు, చిన్నారులు రహదారులపై నడవాలంటేనే భయపడాల్సిన పరిస్థితి ఉందని చెబుతున్నారు. రోడ్లపై నీరు నిలిచిపోవడంతో... పారిశుధ్య సమస్యలు కూడా తలెత్తే అవకాశం ఉందని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలం కొనసాగుతున్న నేపథ్యంలో సమస్య మరింత తీవ్రమయ్యే ప్రమాదం ఉందని వారు పేర్కొంటున్నారు.

**పట్టించుకోని అధికారులు.. ప్రజల్లో అసంతృప్తి**

గ్రామంలోని రోడ్ల దుస్థితిపై పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటివరకు శాశ్వత పరిష్కారం చూపకపోవడంపై గ్రామస్థులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రజలు ప్రతిరోజూ ఇబ్బందులు పడుతున్నా అధికారులు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నిస్తున్నారు.ఇప్పటికైనా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి రోడ్ల పరిస్థితిని పరిశీలించాలని, గుంతలను వెంటనే పూడ్చడంతో పాటు వర్షపు నీరు నిల్వ కాకుండా డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. తాత్కాలిక మరమ్మతులతో సరిపెట్టకుండా సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని, లేనిపక్షంలో ప్రజల ఆందోళనను ఎదుర్కోవాల్సి వస్తుందని వారు హెచ్చరిస్తున్నారు.

# అయిన వాళ్లు ఉన్నా.. అనాథగా మారిన వృద్ధుడు

- మూడు రోజులుగా తిండి లేక అవస్థలు..
- సొంతూరికి పంపించాలని వేడుకోలు



నిజామాబాద్,/ ఆగస్టు 10: /జన సంఘర్షణ)

అయిన వాళ్లు ఉన్నా ఆదుకునే వారు లేక ఓ వృద్ధుడు అనాథగా మారిన హృదయ విదారక ఘటన నిజామాబాద్ జిల్లాలో చోటు చేసుకుంది. చందూర్ గ్రామానికి చెందిన చంద్రయ్య కొంతకాలంగా వేల్పూర్ మండలం జాన్కంపేటలో బిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గత మూడు రోజులుగా సరైన ఆహారం లేకపోవడంతో పాటు అనారోగ్యంతో తీవ్రంగా ఇబ్బందులు పడుతున్న చంద్రయ్యను గమనించిన గ్రామ పెద్దలు మానవత్వంతో స్పందించి సొసైటీ ఆవరణలో ఆశ్రయం కల్పించారు. అయితే తన కుటుంబ సభ్యులకు సమాచారం అందించేందుకు ఫోన్ చేసినప్పటికీ వారి నుంచి స్పందన లేకపోవడంతో వృద్ధుడు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. తనను ఎలాగైనా సొంత గ్రామమైన చందూర్‌కు పంపించాలని, అక్కడికి చేరేలా సహాయం చేయాలని అక్కడున్న వారిని చంద్రయ్య వేడుకుంటున్నాడు. వృద్ధుడి పరిస్థితి చూసి స్థానికులు చలించిపోయారు. కన్నవారు ఉన్నా.. కష్టకాలంలో ఆదుకునే వారు లేకపోతే వృద్ధాప్యం ఎంత దయనీయంగా మారుతుందో చంద్రయ్య పరిస్థితి మరోసారి గుర్తుచేస్తోంది. కుటుంబ సభ్యులు స్పందించి వృద్ధుడిని చేరదీసి, అవసరమైన వైద్యం, సంరక్షణ అందించాలని స్థానికులు కోరుతున్నారు.

# ఇళ్ల కింద గుప్త నిధులంటూ మోసం..

- రూ.కోటి కొల్లగొట్టిన ముఠా గుట్టురట్టు

హైదరాబాద్: /ఆగస్టు 10/(జన సంఘర్షణ)



ఇళ్ల కింద గుప్త నిధులు ఉన్నాయని అమాయకులను నమ్మించి భారీగా డబ్బులు వసూలు చేస్తున్న ముఠా గుట్టును పోలీసులు రట్టు చేశారు. రాజేంద్రనగర్ పోలీసుల సహకారంతో శంషాబాద్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు నలుగురు నిందితులను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రెండు కార్లు, ఒక ఆటో, రెండు ద్విచక్ర వాహనాలు, నాలుగు సెల్‌ఫోన్లు, 25 నకిలీ బంగారు పూత పూసిన నాణేలు, 6 కిలోల బొగ్గు, 4 కిలోల మట్టి, పూజా సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. మహ్మద్ మునావర్ అలియాస్ మున్నా (36), సయ్యద్ అలీ అష్రఫ్ (40), మహ్మద్ హాజీ (25), మహ్మద్ సల్మాన్ (29) కలిసి ముఠాగా ఏర్పడ్డారు. తమకు ప్రత్యేక శక్తులు ఉన్నాయని, భూమిలో పూడ్చిపెట్టిన గుప్త నిధులను బయటకు తీసే విద్య తమకు తెలుసంటూ ప్రజలను నమ్మించేవారు.

**బొగ్గును బంగారంగా మారుస్తామంటూ..**

ముఠా సభ్యులు ముందుగా అమాయకులను గుర్తించి వారి నివాస స్థలాల కింద గుప్త నిధులు ఉన్నాయని చెప్పేవారు. వారు సూచించిన ప్రాంతంలో గుంత తీయించి, ముందుగానే సిద్ధం చేసుకున్న బొగ్గు, నకిలీ బంగారు నాణేలు ఉన్న సంచిని రహస్యంగా గుంతలో పెట్టేవారు. అనంతరం అక్కడ పూజలు నిర్వహించి.. బొగ్గు కొంతకాలానికి బంగారంగా మారుతుందని నమ్మించేవారు. ఆ తర్వాత బాధితుల నుంచి డబ్బులు తీసుకుని అక్కడి నుంచి పరారయ్యేవారు.

**సుమారు 11 మందిని మోసం.. రూ.కోటి వసూలు**

ఈ విధంగా ముఠా హైదరాబాద్‌తో పాటు వివిధ ప్రాంతాల్లో సుమారు 11 మందిని మోసం చేసి రూ.కోటి వరకు వసూలు చేసినట్లుపోలీసుల దర్యాప్తులో ఆధారాలు లభించినట్లు అధికారులు తెలిపారు.

# కర్రెగుట్టల్లో చరిత్రాత్మక మార్పు.. 50 ఏళ్ల తర్వాత ప్రభుత్వ అడుగు!

- మావోయిస్టు ప్రభావం తగ్గడంతో అభివృద్ధికి బాటలు..
- రహదారులు, విద్య, వైద్యంపై ప్రత్యేక దృష్టి
- తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దులో డీజీపీ సీవీ ఆనంద్ పర్యటన
- జాతీయ జెండా ఆవిష్కరణ । భద్రతపై సమీక్ష

ములుగు ప్రతినిధి/ఆగస్టు 10/(జన సంఘర్షణ):





దాదాపు ఐదు దశాబ్దాలుగా దట్టమైన అటవీ ప్రాంతం, మావోయిస్టుల ప్రభావంతో ప్రభుత్వ యంత్రాంగానికి దూరంగా ఉన్న కర్రెగుట్టల్లో చరిత్రాత్మక మార్పునకు నాంది పడింది. మావోయిస్టు ప్రభావం గణనీయంగా తగ్గడంతో తొలిసారిగా ప్రభుత్వ అధికారులు, భద్రతా బలగాలు కర్రెగుట్ట ప్రాంతంలోకి అడుగుపెట్టారు. ములుగు జిల్లా వాజేడు, వెంకటాపురం మండలాల పరిధిలోని కర్రెగుట్టల్లో రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ పర్యటించారు. అంతర్రాష్ట్ర సరిహద్దు ప్రాంతంలో జాతీయ జెండాను ఆవిష్కరించి జాతీయ గీతాన్ని ఆలపించారు. అనంతరం విధుల్లో ఉన్న పోలీసు సిబ్బంది, భద్రతా బలగాల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ.. "కర్రెగుట్టలో చరిత్ర సృష్టించే రోజు ఇది. దాదాపు 50 ఏళ్లుగా మావోయిస్టుల భయంతో ప్రభుత్వ పరంగా ఎవరూ వెళ్లలేని పరిస్థితి ఉండేది. ఇకపై ఈ ప్రాంతంలో అభివృద్ధి కార్యక్రమాలకు నాంది పలుకుతున్నాం" అని తెలిపారు.

**అభివృద్ధికి కొత్త దారులు**

కర్రెగుట్ట చుట్టుపక్కల గ్రామాలకు రహదారులు, విద్య, వైద్యం, ఇతర మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతుందని డీజీపీ వెల్లడించారు. ఇంతకాలం అభివృద్ధికి దూరంగా ఉన్న సరిహద్దు గ్రామాల్లో ప్రభుత్వ సేవలను అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా ముందుకు సాగుతామని తెలిపారు.

**తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ పోలీసుల సమన్వయం**

వాజేడు మండలంలోని మొరుమూరు, మిద్దువ మీదుగా వెంకటాపురం మండలంలోని పామునూరు, జెల్ల ప్రాంతాల మీదుగా డోలి గ్రామానికి డీజీపీ చేరుకున్నారు. అక్కడి నుంచి తడపల గ్రామ సమీపంలోని అంతర్రాష్ట్ర సరిహద్దు ప్రాంతానికి వెళ్లారు. అనంతరం తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ పోలీసు అధికారులు, భద్రతా బలగాలతో సరిహద్దు భద్రత, రహదారి నిర్మాణం, ఇరు రాష్ట్రాల మధ్య సమన్వయం తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు.

**ఒకే ప్రాంతంలో.. అన్ని శాఖల అడుగు**

కర్రెగుట్ట ప్రాంతానికి తొలిసారిగా పోలీసు శాఖతో పాటు కలెక్టర్, రెవెన్యూ, అటవీ శాఖ అధికారులు, సీఆర్పీఎఫ్, గ్రేహౌండ్స్, ఎస్ఐబీ తదితర భద్రతా విభాగాల అధికారులు కలిసి వెళ్లడం ప్రాధాన్యత సంతరించుకుంది. దశాబ్దాలుగా ప్రభుత్వ యంత్రాంగానికి అందని ప్రాంతంలో ఇప్పుడు అధికారులు అడుగుపెట్టడం భద్రతతో పాటు అభివృద్ధికి కొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టినట్లేనని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. మావోయిస్టు ప్రభావం నుంచి బయటపడుతున్న కర్రెగుట్టల్లో ఇక అభివృద్ధి వెలుగులు విరజిమ్ముతాయా? అన్న ఆశలు స్థానికుల్లో చిగురిస్తున్నాయి.

# ఆపదలో రక్తదానం.. చిన్నారులకు వస్త్రాల పంపిణీ

- సేవా కార్యక్రమాలతో ఆదర్శంగా నిలుస్తున్న వివేకానంద ఫౌండేషన్, సేవ్ లైఫ్ ఫౌండేషన్ సభ్యులు

హైదరాబాద్/ ఆగస్టు10/(జన సంఘర్షణ)






ఆపదలో ఉన్న వారికి అండగా నిలవడమే నిజమైన మానవత్వమని చాటుతూ వివేకానంద ఫౌండేషన్ సభ్యులు సేవా కార్యక్రమాల్లో ముందుకు సాగుతున్నారు. ఇందులో భాగంగా ఫౌండేషన్ గ్రూప్ సభ్యుడు రమేష్ అన్న హైదరాబాద్‌లో ఆపదలో ఉన్న ఓ వ్యక్తికి రక్తదానం చేసి మానవత్వాన్ని చాటారు. సమయానికి స్పందించి రక్తదానం చేయడం ద్వారా ఓ ప్రాణానికి అండగా నిలిచిన రమేష్‌ను వివేకానంద ఫౌండేషన్ సభ్యులు అభినందించారు. రక్తదానం చేయడం ద్వారా సమాజానికి సేవ చేయవచ్చని, ప్రతి ఒక్కరూ ఇలాంటి సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని వారు పిలుపునిచ్చారు. అదేవిధంగా వినీత అక్క జన్మదినాన్ని పురస్కరించుకుని సేవ్ లైఫ్ ఫౌండేషన్ ఫౌండర్ చాల సాయి (ప్రభాస్) అన్న ఆధ్వర్యంలో చిన్నారులకు బట్టలు పంపిణీ చేశారు. పుట్టినరోజు వేడుకలను కేవలం వ్యక్తిగత సంబరాలకే పరిమితం చేయకుండా పేద, అవసరంలో ఉన్న చిన్నారులకు సహాయం అందించడం అభినందనీయమని పలువురు కొనియాడారు. "సేవే నిజమైన వేడుక.. ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడమే అసలైన మానవత్వం" అనే సందేశాన్ని ఈ కార్యక్రమాలు చాటుతున్నాయని పలువురు పేర్కొన్నారు. రక్తదానం చేసిన రమేష్ అన్నకు వివేకానంద ఫౌండేషన్ తరపున హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తూ, చిన్నారులకు వస్త్రాలు పంపిణీ చేసిన చాల సాయి (ప్రభాస్) అన్నకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు మరింత విస్తరించి సమాజానికి స్ఫూర్తిగా నిలవాలని ఆకాంక్షించారు.

# మంత్రి అన్ని సార్లు ఎలిశెట్టి పల్లి గ్రామప్రజలను భయబ్రాంతులకు గురిచేసి సాధించింది ఏమిటి

- నాటి ఎమ్మెల్యే నేటి మంత్రి 22సంత్సరాల నుండి ఎలిశెట్టి పల్లి ప్రజలకు చెప్పడామే కానీ బ్రిడ్జికి పౌండేషన్ చేశారా.
- కేంద్రం ప్రభుత్వం 21 కోట్ల రూపాయలు ఎలిశెట్టి పల్లి బ్రిడ్జి కి ఇస్తున్నాది
- 5కోట్ల రూపాయలు రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్నది 30కేజీల బియ్యం కేంద్ర ప్రభుత్వం ఇస్తే రాష్ట్ర ప్రభుత్వం 5కేజీలు మాత్రమే ఇస్తున్నది నిజం కదా.
- దేవదుల లిఫ్ట్ ఇరిగేషన్ నుండి మైదాన ప్రాంతానికి తరలించుకు పోతు ఏజెన్సీ ప్రాంతం ను ఎడారిగా మారుస్తున్నా మంత్రి మాటలు నమ్మి ఏజెన్సీ ప్రాంత ప్రజలు మోస పోకుండా ఉండాలి.
- జెండాలు మొయ్యడం జేజేలు కొట్టడానికి పాలాభి శేఖం చెయ్యడానికి మంత్రి కి ఏజెన్సీ ప్రాంత నాయకులు కావాలి కానీ అభివృద్ధి మాత్రం మైదాన ప్రాంతం కావాలి
- ఏటూరునాగారం బస్ డిపో పూర్తికాక పోవడానికి కారణం ఏమిటీ రెవిన్యూ డివిజన్ ఆమోదం పొంద కుండా అడ్డుకోవడం ఎందుకు మంత్రి చెప్పాలే
- డా జాడి రామరాజు నేత

ములుగుజిల్లా, ములుగు, ఆగష్టు10 (జనసంఘర్షణ):



ములుగు జిల్లా కేంద్రంలో బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు డా జాడి రామరాజు నేత పత్రిక ప్రకటన చేసినారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు అర్ధ రాత్రి 10 గంటల తర్వాత ఎలిశెట్టిపల్లి వెళ్లి గ్రామ ప్రజలను భయబ్రాంతులకు గురిచేస్తూ వీడియోలు తీయించి పంచాయతీ రాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి సాధించింది ఏమిటాని అన్నారు. గత 22 సంత్సరాల నుండి గెలిస్తే ఎలిశెట్టి పల్లి బ్రిడ్జి చేస్తాని చెప్పిన నాటి ఎమ్మెల్యే నేటిమంత్రి ఇంత వరకు ఎందుకు చెయ్యలేక పొయ్యారో మంత్రినే స్వయంగా చెప్పుతే బాగుంటది అన్నారు. 2004 నుండి 2026 వరకు పూటకో పార్టీ రోజుకో మాట చెప్పుకుంటూ 22 సంత్సరాలు పూర్తి చేసుకొని చరిత్ర సృటించరాని అన్నారు. నాడు ఎమ్మెల్యే గా ఉండగా నేడు మంత్రిగా కూడా ఇచ్చిన హామీలు నెరవేర్చక పోవడం వలనేఎలిశెట్టి వాగును బీజేపీ జిల్లా అధ్యక్షులు సిరికొండ బలరాంతో పాటు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు భూక్యా జహర్ లాల్ అజ్మీరా కృష్ణవేణి నాయక్‌తో పాటు బీజేపీ నాయకులు ఎలిశెట్టి ప్రాంతం వెళ్లి ప్రజలను కలిసి వాగును సందర్శించడం జరిగిందాని అన్నారు. బీజేపీ పర్యటనను చూసిన మంత్రి జెండాలు మోసి జేజేలు కొట్టి పాలాభి శేఖం చేసేనాయకులకు ఆదేశాలు జారీ చేసి అర్ధ రాత్రి 10గంటల తర్వాత నిద్రించే వాళ్ళను భయబ్రాంతులకు గురి చేసే వీడియోలు చేపించి సాధించింది ఏమిటో మంత్రి చెప్పాలని అన్నారు. అదేవిదంగా కేంద్ర ప్రభుత్వం ఎలిశెట్టి వాగుపై బ్రిడ్జి నిర్మాణం కోసం 21 కోట్ల రూపాయలు ఇస్తుంటే రాష్ట్రప్రభుత్వం కేవలం 5కోట్ల రూపాయలు మాత్రమే ఇస్తుంది. 3 నెలలకు సరిపడా కేంద్ర ప్రభుత్వం 30కేజీల బియ్యం ఇస్తే రాష్ట్ర ప్రభుత్వం 5 కేజీల బియ్యం మాత్రమే అన్నారు. అదేవిదంగా 2009 నుండి 2014 వరకు ఎమ్మెల్యే గా5సంత్సరాలు పదవి పూర్తి చేసినప్పటికీ ప్రభుత్వం కు నాటి ప్రభుత్వం కు కనీసం ఎలిశెట్టి పల్లి వాగు పై బ్రిడ్జి కోసం ప్రతిపాదన కూడా పంపలేదు. కాబట్టే 2014 అసెంబ్లీ ఎన్నికల్లో ఓడించారు కానీ తర్వాత 2018 ఎన్నికల్లో ఆదివాసీ దళిత బహుజన మైనార్టీ వర్గాల ప్రజలు కాంగ్రెస్ నాయకులు ఇచ్చిన హామీలు నమ్మి ఓట్లు వేసి 2వ సారి ఎమ్మెల్యే ను చేస్తే 1912 ఏప్రిల్ 15అర్ధరాత్రి జరిగిన అట్లాటిక్ మహాసంద్రం లో జరిగిన టైటానిక్ పడవ ప్రమాదం ను 2022జులై 21 ఎలిశెట్టి పల్లి వాగు లో పడవ ప్రమాదం లో ఉడుగు చెట్టు కు తగిలించి చూపించావు అన్నారు నాడు ఎలిశెట్టి పల్లి బ్రిడ్జి తో పాటు తాడ్వాయి, మంగపేట, ఏటూరునాగారం, కన్నాయిగూడెం మండలం లో ఉన్నా సమస్యలు గుర్తు చేసుకుంటూ ప్రజలను నమ్మిస్తూ ఎమ్మెల్యే గా రెండవ సారి ఎన్నికైన తర్వాత కొండాయి బ్రిడ్జి కింద మంత్రి అనుసార్ల ఆర్థిక పోరాటం చేస్తూ బ్రిడ్జి పక్కపొట్టి ఇసిక తియ్యడం తో 6కోట్ల తో నిర్మాణం చేసిన బ్రిడ్జి 6సంత్సరాలు లేకుండా చెయ్యడమే కాకుండా 8మంది మరణాలకు కారణం అయ్యిందని అన్నారు. అదేవిదంగా 2022జులై లో నాటి తెలంగాణ ముఖ్య మంత్రి కెసిఆర్ ఏటూరునాగారం కు ఏమికావాలో కోరుకొమ్మాని నాటి ఎమ్మెల్యే నేటి మంత్రిని అడుగుతే 9000వేల జనాభా కలిగిన ములుగు మున్సిపాలిటీ ములుగు బస్సు డిపో కావాలని కోరింది కానీ 20334 మంది జనాభా కలిగిన ఏటూరునాగారం మున్సిపాలిటీ కావాలని కోరలేదు ఏటూరునాగారం బస్సు డిపో పునర్ నిర్మాణం చెయ్యాలని కొరకుండా ఏజెన్సీ ప్రాంతం అభివృద్ధి ని అడ్డుకుంటూ రాక్షస నందం పొందుతున్న మంత్రి కి ఆదివాసీ దళిత బహుజన వర్గాల ప్రజలు డిపాజిట్ రాకుండా చెయ్యాలని బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు డా జాడి రామరాజు నేత అన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రి స్థలానికి హద్దులేవి..?

- కనుమరుగవుతున్న సరిహద్దులు.. ఆక్రమణలకు అవకాశం
- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న అధికార యంత్రాంగం!

వరంగల్/వర్ధన్నపేట:/ఆగస్టు 10/(జన సంఘర్షణ)

వర్ధన్నపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి కేటాయించిన స్థలం క్రమంగా కనుమరుగవుతోందన్న ఆరోపణలు స్థానికంగా ఆందోళన కలిగిస్తున్నాయి. ప్రజల ఆరోగ్య అవసరాల కోసం కేటాయించిన ప్రభుత్వ భూములను కాపాడాల్సిన బాధ్యత అధికారులపై ఉన్నప్పటికీ.. సంబంధిత శాఖలు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నాయని స్థానికులు మండిపడుతున్నారు. గతంలో ఆసుపత్రి స్థలానికి సంబంధించిన హద్దులు దెబ్బతింటున్నాయంటూ ఆందోళనలు వ్యక్తం కావడంతో అప్పటి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విజయలక్ష్మి చొరవ తీసుకుని ఆసుపత్రి చుట్టూ ఉన్న స్థలానికి రక్షణ కల్పించినట్లు స్థానికులు తెలిపారు. అయితే ఆమె బదిలీపై వెళ్లిన అనంతరం ఆసుపత్రికి వచ్చిన పలువురు సూపరింటెండెంట్లు, వైద్యాధికారులు స్థల పరిరక్షణపై తగినంత దృష్టి సారించలేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**హద్దులు దాటి ఆక్రమణల ఆరోపణలు**

అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో ఆసుపత్రి చుట్టుపక్కల ఉన్న కొందరు ప్రైవేటు వ్యక్తులు తమకు సంబంధించిన స్థలాల హద్దులను దాటి ఆసుపత్రికి చెందిన ప్రభుత్వ భూమిని ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయంపై అధికారులు వెంటనే స్పందించకపోతే భవిష్యత్తులో ప్రభుత్వ స్థలం మరింత కబ్జాకు గురయ్యే ప్రమాదం ఉందని స్థానికులు హెచ్చరిస్తున్నారు.

**పరిశుభ్రత పనులకూ అడ్డంకులు?**

వర్షాకాలం కావడంతో ఆసుపత్రి ఆవరణలో పిచ్చి మొక్కలు, గడ్డి విపరీతంగా పెరిగి అపరిశుభ్ర వాతావరణం నెలకొంటోంది. శానిటేషన్ సిబ్బంది పరిశుభ్రత చర్యలు చేపట్టే సమయంలో కొందరు ప్రైవేటు వ్యక్తులు ఈ స్థలం తమదేనంటూ సిబ్బందిని ప్రశ్నిస్తూ, పనులకు అడ్డుపడుతున్నారని ఆరోపణలు వస్తున్నాయి. దీంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులతో పాటు వారి సహాయకులు కూడా దోమలు, దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు చెబుతున్నారు. ఆసుపత్రికి వచ్చే రోగుల బంధువులు కాసేపు కూర్చోవడానికి కూడా భయపడుతున్న పరిస్థితి నెలకొన్నదని, పెరిగిపోయిన గడ్డిలో పాములు, విషపురుగులు సంచరించే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**అధికారులకు స్థానికుల హెచ్చరిక:**

ఇప్పటికైనా రెవెన్యూ, మున్సిపల్, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు సమన్వయంతో తక్షణమే స్పందించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఆసుపత్రికి కేటాయించిన మొత్తం స్థలాన్ని అధికారికంగా సర్వే చేసి, హద్దులను నిర్ధారించి, స్పష్టమైన సరిహద్దులు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.అదేవిధంగా ఆసుపత్రి ప్రభుత్వ స్థలానికి చుట్టూ పటిష్టమైన ప్రహరీ గోడ నిర్మించి, భవిష్యత్తులో ఎలాంటి ఆక్రమణలకు తావులేకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రభుత్వ భూమి పరిరక్షణలో అధికారులులిఇకనైనా నిర్లక్ష్యం వీడి తక్షణ చర్యలు చేపట్టాలి. ఆక్రమణలకు పాల్పడినట్లు తేలితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. లేకపోతే ప్రభుత్వ ఆస్తులు కళ్లముందే కబ్జాకు గురవుతున్నా అధికారులు మౌనంగా ఉన్నారనే విమర్శలకు తావిచ్చినట్లవుతుందని స్థానికులు హెచ్చరిస్తున్నారు.



Printed, published and owned by **Rachamallu Madhavi** Printed at **Kranthi Printing Press**, 42/603/1/1-a, Mj Colony, Street no 5, Mjcolony, Moulali Secundrabad, and Published from h.no: 10-10-117/150, Nayi brahmana colony. Neerugonda Hanuman road, Nagaram Nizamabad (m&d) 503001, Telangana, Editor : **Rachamallu Madhavi**. **RNI Reg No :tel/2024/89323,** Cell 6305026524, Email:janasangarshana@gmail.co